ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
ఆదివారం 3 ఆగస్టు 2025

చిన్నారులకు తల్లిపాలు శ్రేయస్కరం
మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ 8లో..

పాస్‌బుక్ ఉంటేనే యూరియా అందించాలి
జిల్లా సహకార అధికారి మనోజ్‌కుమార్ 8లో..

ఆలయాల్లో శ్రావణి సందడి 7లో..

జిల్లాలో పోలీస్ యాక్ట్

జగిత్యాల క్రైం, ఆగస్టు 2. (ఆంధ్రజ్యోతి) జిల్లాలో ఆగస్టు చివరి వరకు పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ అశోక్ కుమార్ శనివారం పేర్కొన్నారు. జిల్లా పరిధిలో ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించకూడదన్నారు. వివిధ కార్యక్రమాల నిర్వహణకు ముందుగా పోలీసు అనుమతి తీసుకోవాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని సూచించారు.

జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

మెటపల్లి టౌన్ ఆగస్టు2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్థానిక మినీ స్టేడియంలో శనివారం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఎంపిక పోటీలను అసోసియేషన్ అధ్యక్షులు గంగుల శ్రీధర్ ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుండి చిన్నచిన్న ఆటలతో. అథ్లెటిక్స్ వైపు దృష్టి సారించాలని, క్రీడల వలన విద్యార్థులకు స్నేహభావం ఏర్పడుతుందన్నారు. విద్యార్థుల్లో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. అనంతరం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్తయ్యరెడ్డి మాట్లాడుతూ జనగామలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు 20 మందిని ఎంపిక చేశామని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు గజెల్లి రాందాస్, క్రీడా ఉపాధ్యాయులు రాజు మరి పెళ్లి కార్తిక్. వేణు, సింధుజ, లతా, భవాని పాల్గొన్నారు.

శ్రమదానం

జగిత్యాల అర్బన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాలలో శనివారం ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ఆధ్వర్యంలో శ్రమదానం నిర్వహించారు. కళాశాల భవనాలపై స్లాబ్‌లపై ఉన్న చెట్లను తొలగించడంతో పాటు వర్షం నీరు పై కప్పులపై నీరు నిలవకుండా ఉండడానికి అవసరమైన చర్యలను చేపట్టారు. పిచ్చి మొక్కలను తొలగించారు. ప్రిన్సిపాల్ అలియా మక్సూద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కొట్టాల తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.



'పీఎం ఉష'తో మహర్దశ

- ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీకి రూ.5 కోట్లు మంజూరు
- గ్రామీణ విద్యార్థులకు ఉన్నత విద్య అందించడమే లక్ష్యం
- చురుగ్గా సాగుతున్న 12 అదనపు గదుల నిర్మాణం
- రూ.1.08 కోట్లతో సాంకేతిక విద్యా సామగ్రి కొనుగోలు

జగిత్యాల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలు, వెనుకబడిన వర్గాల విద్యార్థులకు ఉన్నత విద్య మరింత చేరువ చేయాలనే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రధాన మంత్రి ఉచ్చతర్ శిక్ష అభియాన్ (పీఎం ఉష) పథకంతో జగిత్యాల ప్రభుత్వ మహిళా డిగ్రీ అటానమస్ కళాశాలకు మహర్దశ పట్టుకుంది.

డిగ్రీ కళాశాల స్థాయి ఉన్నత విద్యలో నాణ్యతా ప్రమాణాలు పెంచడం, విద్యార్థులకు సమాన అవకాశాలు కల్పించడం, విద్యను మరింత అందుబాటులోకి తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం పీఎం ఉష పథకాన్ని అమలు చేస్తున్నది. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పీఎం ఉష పథకానికి జగిత్యాలలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ అటానమస్ కళాశాల ఎంపికైంది. ఈ పథకం కింద కళాశాలకు కేంద్ర ప్రభుత్వం రూ.5 కోట్లు మంజూరు చేసింది. ఇందులో రూ.3.92 కోట్ల నిధులు భవనాల నిర్మాణాలకు, రూ.1.08 కోట్లు సాంకేతిక విద్య సామగ్రి కొనుగోలు కోసం కేటాయించారు.

అటానమస్ హోదా

జగిత్యాలలో 1998 సంవత్సరంలో మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటైంది. సుమారు 2.1 ఎకరాల్లో 30 గదులతో కళాశాల నిర్వహిస్తున్నారు. ఈ కళాశాల ఇటీవల బీ ప్లస్ ప్లస్, న్యాక్ గుర్తింపు పొందింది. కళాశాలలో డిజిటల్ ల్యాబ్, డిజిటల్ లైబ్రరీ, జిమ్, టీఎస్‌కేసీ సెంటర్ తదితర వసతులున్నాయి.

ప్రస్తుతం కళాశాలలో వెయ్యి మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. కళాశాలలో బీఏ, బీకాం కంప్యూటర్స్, బీకాం కామర్స్, బీఎస్సీ, మిగతా 8వ పేజీలో..

మౌలిక వసతుల కల్పన

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో అదనంగా రెండు వేర్వేరు భవనాలు రెండు అంతస్తులతో నిర్మిస్తున్నారు. మొదటి భవనంలో నాలుగు, రెండో భవనంలో ఎనిమిది మొత్తంగా 12 అదనపు తరగతి గదులను నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఆయా గదుల నిర్మాణ పనులు ప్రారంభం కాగా వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. నిర్మాణ బాధ్యతలను టీజీఈడబ్ల్యూఐడీసీ పర్యవేక్షిస్తోంది. పీఎం ఉష పథకం కింద రూ.1.08 కోట్ల నిధులతో 60 కంప్యూటర్లు, 22 డిజిటల్ స్మార్ట్ బోర్డులు, 3 స్కానర్లు, 4 ప్రింటర్లు, 5కేవీ సామర్థ్యం గల మూడు యూనిట్ల బ్యాటరీ యూపీఎస్‌లు, 60 కంప్యూటర్ టేబుళ్లు, 60 కుర్చీలు మొద లైనవి సమకూర్చారు. ఇప్పటికే వీటిలో ఎనిమిది డిజిటల్ స్మార్ట్ బోర్డులు, కంప్యూటర్లు ఇతరత్రా సాంకేతిక డిజిటల్ సామగ్రిని కళాశాల విద్యార్థుల సౌకర్యార్థం వినియోగంలోకి తీసుకువచ్చారు. అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు పూర్తయితే అన్ని రకాల హంగులతో కార్పొరేట్ స్థాయిలో డిగ్రీ విద్య అంద నుంది. పీఎం ఉషా పథకంతో కళాశాలకు మహర్దశ పట్టనుంది.


కళాశాలలో నిర్మిస్తున్న అదనపు తరగతి గదులు

ప్రభుత్వ పథకాలపై అవగాహన ఉండాలి

●డీఆర్‌డీఏ పీడీ రఘువరణ్


మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ రఘువరణ్

జగిత్యాల అగ్రికల్చర్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మహిళా సమాఖ్య సభ్యులకు ప్రభుత్వ పథకాల పట్ల అవగాహన తప్పనిసరిగా ఉండాలని డీఆర్‌డీఏ పీడీ రఘువరణ్ అన్నారు. సమాఖ్య సభ్యులందరికీ అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని డీఆర్‌డీఏ పీడీ అన్నారు. జిల్లా సమాఖ్య కార్యాలయ సమావేశ మందిరంలో సమాఖ్య బాధ్యులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రఘువరణ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. ఆ పథకాలు పేద మహిళలకు అందేలా కృషి చేయాలని సూచించారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాల ద్వారా వారి ఆర్థిక స్థితిగతులను మెరుగుపర్చేలా కృషి చేయాల్సిన బాధ్యత మండల సమాఖ్యలదని పేర్కొన్నారు. ప్రభుత్వ హాస్టల్‌లకు కాస్మోటిక్ సరఫరా మహిళా సంఘాల వారు చేయాలని సెర్ప్ నుంచి ఆదేశాలు వచ్చాయని, కాబట్టి సంబంధిత మండలాల నుంచి వచ్చిన వాటిని ప్రపోజల్స్ లాగిన్‌లో ఎంట్రీ చేయాలన్నారు. రానున్న సీజన్‌లో కొనుగోలు కేంద్రాల సంఖ్య పెంపునకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లా సమాఖ్య క్యాంటీన్ మరింత హంగులతో ఆధునీకరించేలా చూడాలని, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తులు రెండో జత త్వరితగతిన కుట్టివ్వాలని ఆదేశించారు. జిల్లా సెర్ప్ ఏపీడీ సునీత మాట్లాడుతూ మండల, గ్రామ సమాఖ్యలు ,స్వశక్తి సంఘాల పుస్తకాల నిర్వహణ, ఆర్థిక లావాదేవిల పట్ల పూర్తిస్థాయిలో అవగాహన ఉండేలని, బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలు, టార్గెట్ ప్రకారం సిబ్బందితో పూర్తిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీఎం విజయభారతి, నారాయణ, రమేష్; నాగేశ్వర్‌రావు. స్త్రీనిధి ఆర్ఎం రాం నారాయణ, ఏపీఎం, కార్యాలయ అధికారులు పాల్గొనారు.

సెర్ప్ ఏపీఎంగా రమేష్

మల్లాపూర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : మల్లాపూర్ మండల సెర్ప్ కార్యాలయం అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్‌గా బైండ్ల రమేష్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఏపీఎంగా విధులు నిర్వహించిన దేవరాజం మల్యాల మండలానికి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో నిర్మల్ జిల్లా కుబర్ మండలం నుంచి బదీలిపై మల్లాపూర్‌కు వచ్చారు. ఏపీఎం రమేష్‌కు సెర్ప్ మహిళలు, సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

దివ్యాంగుల మహాసభను విజయవంతం చేయాలి

సారంగాపూర్, ఆగస్టు2 (ఆంధ్రజ్యోతి) : హైదారాబాద్‌లో ఆగస్టు, 13 న నిర్వహించ తలపెట్టిన దివ్యాంగుల మహ గర్జన సభను విజయవంతం చేయాలని జిల్లా అధికార ప్రతినిధి బెజ్జంకి సతీష్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా దివ్యాంగులకు, ఒంటరి మహిళలకు పింఛన్లు పెంచుతామని మాట ఇచ్చి ఇప్పటి వరకు పెంచక పోవడాన్ని నిరసిస్తూ ఈ దివ్యాంగుల మహ గర్జన సభను నిర్వహిస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. 6న జగిత్యాలకు మందక్రిష్ణ వస్తున్నారని తెలిపారు.

నాసిరకం ఎరువులు విక్రయిస్తే చర్యలు

-కలెక్టర్ సత్యప్రసాద్


రికార్డులను తనిఖీ చేస్తున్న కలెక్టర్

జగిత్యాల అగ్రికల్చర్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): నాసిరకం ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ సత్యప్రసాద్ హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని మన గ్రోమోర్ దుకాణంలో ఎరువుల సరఫరాపై జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సెంటర్‌లోని ఎరువుల విక్రయాలకు సంబంధించిన రికార్డులను పరిశీ లించారు. ఎరువుల దుకాణం ముందు సూచిక బోర్డుపై ఎరువులు మందులు మరియు విత్తనాల ధరల పట్టికలో ధరలు రాయాలని సూచించారు. కాలం చెల్లిన మందులను రైతులకు అమ్మరాదని పేర్కొన్నారు. ఎరువులు, స్ప్రే మందులు సరైన ధరలకు అమ్మాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఏవో భాస్కర్, మండల అధికారి ఏవో వినీల తదితరులున్నారు.

ఇసుక డంప్ ఏర్పాటు చేయాలి

కలెక్టర్‌కు మాజీ మంత్రి జీవన్‌రెడ్డి లేఖ

జగిత్యాల అర్బన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నిర్మాణ రంగానికి అవసరమైన ఇసుక అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు జగిత్యాల పట్టణంలో ఇసుక డంప్ ఏర్పాటు చేయాలని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి శనివారం కలెక్టర్ సత్యప్రసాద్‌కు లేఖ రాశారు. జగిత్యాల పట్టణ కేంద్రంగా మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా నిర్వహిచిన స్టాక్ పాయింట్ సంవత్సర కాలంగా నిలిపివేశారన్నారు. దీంతో స్థానికంగా ఇసుక అందుబాటులో లేకపోవడంతో నిర్మాణాలు నిలిచిపోయే పరిస్థితి నెలకొందని లేఖలో పేర్కొన్నారు. వినియోగదారుల సమస్యను తీర్చాలని ఆయన కోరారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ కేంద్ర బృందం పర్యటన


అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

పెగడపల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : పెగడపల్లి మండలంలోని ఆరవెల్లిలో శనివారం స్వచ్ఛ సర్వేక్షణ్ కేంద్ర బృందం సభ్యులు పర్యటించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ 2025 గ్రామీణ సర్వేలో భాగంగా కేంద్ర బృందం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, డంపింగ్ యార్డులు, ఆరోగ్య ఉప కేంద్రం పల్లె దవాఖాన, మతపరమైన సంస్థలు, సోక్ పిట్స్‌తో పాటు వివిధ రకాల రిజిష్టర్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో బృందం సూపర్‌వైజర్ వి.మధూకర్, జిల్లా ఎస్‌బీఎం కోఆర్డినేటర్ చిరంజీవి, ఎంపీడీవో ఎ.శ్రీనివాస్‌రెడ్డి, ఈసీ రమాపతి, రజనీకాంత్, పంచాయతీ కార్యదర్శి అనిత, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు

ధర్మపురి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి డివిజన్‌కు రైతులకు కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ యాంత్రీకరణ ఉప పథకం (ఎస్ఎంఏఎం) కింద 91.42 లక్షలు మంజూరు అయ్యాయని ఏడీఏ రాంచందర్ ఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులను ఎంపిక చేసి అవసరమైన రాయితీపై యంత్ర పరికరాలు కొనుగోలు చేసే ప్రక్రియ గురించి మండల వ్యవసాధికారులను ఆదేశించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. సన్న చిన్నకారు రైతులకు 40 శాతం రాయితీ, ఎస్సీ, ఎస్టీ రైతులకు 50 శాతం రాయితీ లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. డివిజన్ స్థాయిలో రాయితీపై అందించే యంత్ర పరికరాలు బ్యాటరీ స్ప్రేయర్లు 892, పవర్ స్ప్రేయర్స్ 153, రోటోవేటర్ 51, సీడ్ కమ్ ఫర్టిలైజర్ డ్రిల్ 14, కల్టివేటర్ కమ్ ప్లవ్ 67, బండ్ ఫార్మర్ 3, పవర్ వీడర్ 6, బ్రష్ కట్టర్ 13, పవర్ టిల్లర్ 7, స్ట్రా బేలర్లు 10 ఉన్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి కలిగి ఉన్న రైతులు డివిజన్‌లో ఉన్న ఆరు మండలాల వ్యవసాయాధికారి, వ్యవసాయ విస్తరణ అధికారులకు దరఖాస్తులు స్వీకరిస్తారని ఆయన తెలిపారు. అందుబాటులో ఉన్న పని ముట్లకు ఎంపిక ఉంటుందని, రైతులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

-జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత


మాట్లాడుతున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ వసంత

జగిత్యాలరూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ శ్రేణులు సత్తా చాటాలని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంతసురేష్ అన్నారు. శనివారం జగిత్యాల రూరల్ మండలంలోని వంజరిపల్లి, నర్సింగాపూర్, గొల్లపల్లె, తిమ్మాపూర్, జాబితాపూర్ బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్క బీఆర్ఎస్ కార్యకర్త సమన్వయంతో పనిచేసి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ మహిపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఆనంద్‌రావు, మాజీ సర్పంచులు బుర్ర ప్రవీణ్‌గౌడ్, రజితగంగాధర్, బీఆర్ఎస్ నాయకులు కమలాకర్‌రావు, మల్లేష్‌గౌడ్, చిత్తారి శ్రీనివాస్, గంగారెడ్డి, శ్రీనివాస్ , రవి, ధర్మయ్య, దశరథం, గంగామల్లు, వినోద్ పాల్గొన్నారు.

'సాగు నీరు అందించడంలో ప్రభుత్వం విఫలం'

జగిత్యాలరూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పంటలకు నీరివ్వలేని నిస్సహాయస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంతసురేష్ ఆరోపించారు. శనివారం జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్ గ్రామ శివారులోని పొలంలో నాట్లు వేస్తున్న మహిళా కూలీలతో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ వసంత ముచ్చటించి వారు పడుతున్న బాధలను అడిగి తెలుసుకున్నారు. సరైన సమయానికి విత్తనాలు, ఎరు వులు, నీరు ఇవ్వక రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం అరిగోస పెడుతోందన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

రాయికల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిష్టంపేట గ్రామంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ సహకారంతో మంజూరైన రూ.5 లక్షలతో శనివారం గ్రామ నాయకులు సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులు జోగినిపెల్లి తిరుపతి గౌడ్, మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

జగిత్యాల అర్బన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలో వనివారం డీసీబి బ్యాంక్ మరియు మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 100 మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించినట్లు మేనేజర్ ఈగ రాజేశం తెలిపారు. వైద్యపరీక్షలు నిర్వహించిన మెడికవర్ ఆసుపత్రి సిబ్బందికి డిసీబీ బ్యాంక్ మెనేజర్ ఈగ రాజేశం కృతజ్ఞతలు తెలిపారు.

'రేషన్‌కార్డుల జారీ నిరంతర ప్రక్రియ'


రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న మంత్రి అడ్లూరి, కలెక్టర్

వెల్గటూర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డులు పేద ప్రజల జీవన ప్రమాణానికి తార్కాణమని సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. శనివారం వెల్గటూర్, ఎండపల్లి మండలాల లబ్దిదారులకు కొత్త రేషన్ కార్డులు, కళ్యాణ లక్ష్మి చెక్కులను జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం పాటు పడుతూ వారి అభివృద్ధికి కృషి చేస్తుందని తెలిపారు. రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని వాటిలో మార్పులు చేర్పులు చేసుకునే అవకాశం ఉంటుందని అన్నారు. ప్రభుత్వం కొత్తగా రేషన్ కార్డు పొందిన వారికి రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి, గృహజ్యోతి పథకాలకు దరఖాస్తు చేసుకునేందుకు తాజాగా అవకాశం కల్పించిందని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్‌రూంలు కట్టిస్తామని చెప్పి మొహం చాటేసిందన్నారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇందిరమ్మ రాజ్యంలో నియోజకవర్గానికి 3500 ఇళ్ల చొప్పున కట్టించే కార్యక్రమం ప్రభుత్వం చేపట్టి సొంత ఇంటి కల నెరవేరుస్తున్నామని అన్నారు. గొప్ప విషయమన్నారు. లబ్దిదారులకు నేరుగా వారి అకౌంట్లలో రూ.5 లక్షలు పడతాయని తెలిపారు. ఇప్పటికే ఇందిరమ్మ ఇళ్ల కట్టుకున్న వారికి దశల వారీగా డబ్బులు జమ అవుతున్నాయని పేర్కొన్నారు. రైతులకు 9 రోజులలో రూ. 9వేల కోట్ల రైతు బరోసా వేసినట్లు గుర్తు చేశారు.

రేషన్ కార్డులు రానివారు మీసేవ సెంటర్లలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఉమ్మడి వెల్గటూర్ మండలంలో 2200 మంది రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోగా అర్హులైన 1969 మందికి కార్డులు జారీ చేసినట్లు తెలిపారు. రేషన్ కార్డులో కొత్తగా పేరు నమోదు కొరకు 2800 మంది దరఖాస్తు చేసుకోగా 2755 మంది పేర్లు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ మధు సుధన్, డీడబ్ల్యూవో బోనగిరి నరేష్, తహశీల్దార్ శేఖర్, ఎంపీడీవో కృపాకర్, ఏఎంసీ చైర్మన్ గోపిక జితేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ తిరుపతి, పీఏసీఎస్ చైర్మన్లు రాంరెడ్డి, రత్నాకర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

గొల్లపల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరాముల పల్లె గ్రామంలో శుక్రవారం రోజు జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తునికి శ్రీనివాస్ కుటుంబ సభ్యులను ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, వికలాంగుల సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శనివారం పరామర్శించారు. గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న దాసరి పెద్దన్నను మంత్రి పరామర్శించి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గోవిందు పల్లె గ్రామంలో ఇటీవల పురుగుల మందు సేవించి బలవన్మరణం చెందిన బోనగిరి శివ అనే విద్యార్థి కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించారు. మృతుల చిత్ర పటాలకు ఘన నివాళులర్పించి బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. శ్రీరాముల పల్లెలో శ్రీనివాస్ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని బాధిత కుటుంబ సభ్యులకు భరోసానిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ, యూత్ మండల శాఖ అధ్యక్షులు ముస్కు నిశాంత్‌రెడ్డి, గౌతమ్ రాజు, ఏఎంసీ చైర్మన్ సంతోష్, వైస్ చైర్మన్ రాజిరెడ్డి పాల్గొన్నారు.

బల్దియాలో అక్రమాలపై అడిషనల్ కలెక్టర్ ఆరా

జగిత్యాల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మున్సిపల్‌లో పరిపాలన పరమైన పొరపాటు, అక్రమాలపై అదనపు కలెక్టర్ బీఎస్ లత ఆరా తీసినట్లు సంబంధిత వర్గాల్లో చర్చ జరుగుతోంది. శనివారం మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి పలు వ్యవహారాలపై అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, అకౌంట్స్, మెప్మా తదితర విభాగాల్లో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, పాలనపరమైన వ్యవహారాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

మున్సిపల్‌లో ఇంటి పన్నుకు సంబంధించిన రూ.60 వేల డబ్బులను ఓ బిల్ కలెక్టర్ ఆలస్యంగా అకౌంట్‌లో జమ చేయడం, డీజిల్ వినియోగం వ్యవహారంలో సుమారు రూ. 16 లక్షల దుర్వినియోగం జరిగినట్లు ఆరోపణలు రావడం, మున్సిపాలిటీలో కీలకమైన రెండు విభాగాలకు ఇంచార్జీల నియామకంలో అవకతవకలు చోటు చేసుకున్నట్లు ఇటీవల ప్రచారం జరిగింది. ఈనేపథ్యంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి పరిశీలన జరపడం చర్చనీయాంశంగా మారింది. కాగా పట్టణంలో ఇంటి పన్ను వసూలు చేసిన డబ్బులు పక్కదారి పట్టించినందుకు జగిత్యాలలో మున్సిపల్‌లో పనిచేస్తున్న బిల్ కలెక్టర్ గంగనర్సయ్యను సస్పెండ్ చేస్తూ రెండు రోజుల క్రితం ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రస్తుత యేడాది జూన్ 13వ తేదీన మున్సిపల్ పనిచేస్తున్న బిల్ కలెక్టర్ గంగనర్సయ్య వివిధ వార్డుల్లో గల నాలుగు ఇంటినంబర్లకు చెందిన రూ.60 వేలు అస్తి పన్ను వసూలు చేశాడు. నిబంధనల ప్రకారం సంబంధిత డబ్బులను అదే రోజు సాయంత్రం వరకు కార్యాలయంలో అప్పగించాల్సి ఉంటుంది. ఆలస్యంగా సంబంధిత డబ్బులను మున్సిపల్ అకౌంట్‌లో జమ చేశాడు. ఈ విషయాన్ని గుర్తించిన అధికారులు బిల్ కలెక్టర్ గంగనర్సయ్యకు నోటీసు జారీ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బిల్ కలెక్టర్ గంగనర్సయ్యను సస్పెండ్ చేస్తూ క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు లేఖను పంపినట్లు మున్సిపల్ కమిషనర్ స్పందన వెల్లడించారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతి

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఓ మద్యం దుకాణం సమీపంలో మండల కేంద్రానికే చెందిన హమాలీ కార్మికుడు ఒగ్గు మల్లయ్య(60) అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి కథనం మేరకు.. మల్లయ్య స్థానికంగా హమాలీ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈనెల1న ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన తిరిగి రాలేదు. శనివారం మధ్యాహ్నం గ్రామంలోని ఓవ్యక్తికి మద్యం దుకాణం సమీపంలో అంగన్‌వాడీ కేంద్రం వద్ద మల్లయ్య కిందపడి అనుమానాస్పద స్థితిలో కనిపించాడు. దీంతో అతడు కుటుంబసభ్యులకు సమాచారం అందించాడు. అక్కడకు చేరుకుని చూసేసరికి మల్లయ్య చనిపోయి ఉన్నాడు. మృతుడు మల్లయ్య భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ తెలిపారు.

గంజాయి మొక్కలు స్వాధీనం

జగిత్యాలరూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలంలోని వంజరిపల్లి గ్రామానికి చెందిన మోతుకు రాజు అనేవ్యక్తి ఇంటి సమీపంలోని ప్రహరీ పక్కననాలుగు గంజాయిమొక్కలు స్వాధీనం చేసుకున్నట్లు జగిత్యాలరూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. మోతుకురాజు తన ఇంటిలో గంజాయి మొక్కలు పెంచుతున్నాడనే సమాచారం మేరకు పోలీసులు అతని ఇంటికెళ్లి తనిఖీచేసి నాలుగు మొక్కలను గుర్తించారు. గంజాయి మొక్కలను సీజ్‌చేసి మోతుకు రాజుపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్-జగిత్యాల రహదారిపై కొత్తపల్లి వద్ద శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. కరీంనగర్ నుంచి జగిత్యాల వైపునకు వెళ్తున్న కారు ఎదురుగా వస్తున్న వ్యాన్‌ను ఢీకొట్టినట్లు పోలీసులు తెలిపారు. కారులో ఉన్న ముగ్గురిలో ఇద్దరికి గాయపడ్డారని, ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నారని తెలిపారు. రోడ్డు ప్రమాదానికి సంబంధించి ఫిర్యాదు అందలేదని కొత్తపల్లి పోలీసులు తెలిపారు.

పారాక్వాట్.. ప్రాణాంతకం



- గడ్డి మందులతో రైతుల ఆరోగ్యంపై ప్రభావం
- విషపూరితమైన మందుతో పార్కిన్సన్ వ్యాధి

చొప్పదండి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పారాక్వాట్ డైక్లోరేడ్(పెస్టిసైడ్) అనేది ఒక క్రిమిసంహారక మందు. దీనిని వ్యవసాయంలో కలుపు మొక్కలను నాశనం చేయడానికి రైతులు ఉపయోగిస్తున్నారు. పంట పొలాల్లో గడ్డిని తొలగించడానికి ఇది ఉపయోగపడుతుందని రైతులు ఈ మందును విస్తృతంగా పిచాకిరి చేస్తున్నారు. పారాక్వాట్ మందు ప్రాణాంతకంగా మారుతుందని, ఈ మందు పిచికారి చేసే సమయంలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోకపోతే ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని అధికారులు చెబుతున్నారు. అత్యంత విషపూరితమైన ఈ మందుతో రైతులు పార్కిన్సన్ వ్యాధిన బారిన పడే అవకాశాలు ఉన్నట్లు శాస్త్రవేత్తలు చెబుతు న్నారు. ప్రపంచ వ్యాప్తంగా విస్తృతంగా వాడుతున్న ఈ మందును 50 దేశాల్లో నిషేధించారు. పారాక్వాట్ మందు పంట పొలాలకు కలుపు నివారణకు ఉపయోగించే అత్యంత ప్రమాదకరమైనది, విషపూరితమైనదిగా మందు డబ్బాలపైనే కంపెనీలు తెలియజేస్తున్నాయి. మందు ను పిచికారి చేసే సమయంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోని పక్షంలో ఆరోగ్యంపై ప్రభావం చూపే ఆస్కారం ఉంది. ఈ మందు నాడి వ్యవస్థను దెబ్బతీస్తుంది. తరచూ ఈ మందులను పిచికారి చేసే రైతులకు దీర్ఘకాలిక వ్యాధులైన పార్కిన్సన్స్(చేతులు వణుకుతాయి) వ్యాధి బారిన పడే అవకాశం ఉంది. విదేశాల్లో ఈ మందును వాడిన అనేక మంది రైతులు పార్కిన్సన్స్ బారిన పడినట్లు సమాచారం. యూరప్ సహా అనేక దేశాల్లో ఈ మందులను నిషేధించారు. ఈ మందుల ప్రభావం ఊపిరితిత్తులు, చర్మం, కళ్లపై కూడా పడే అవకాశం ఉంది. రైతులు, రైతు కూలీలతోపాటు పర్యావరణం, జీవ వైవిధ్యంపై కూడా ప్రభావం పడుతుందని అధికారులు చెబు తున్నారు.

● సూచనలు, జాగ్రత్తలు...

రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో పారాక్వాట్ మందును వాడిన సందర్భంలో పలు జాగ్రత్తలను తప్పనిసరిగా తీసుకోవాలి. పారాక్వాట్ మందు డబ్బాపై ఉన్న సూచనలు పాటించాలి. నిర్దేశించిన మోతాదులో మాత్రమే మందును వాడాలి. ఇతర మందులతో ఈ మందును కలుపవద్దు. మందు తయారీదారు చేసిన సూచనల ప్రకారమే మందును పిచికారి చేయాలి.

రైతులు రక్షణ చర్యలు చేపట్టాలి...

- వంశీకృష్ణ, వ్యవసాయాధికారి, చొప్పదండి



పారాక్వాట్ మందును పిచికారి చేసే సమయంలో రైతులు పలు రక్షణ చర్యలు చేపట్టాలి. చేతులకు, గ్లౌజులు, ముఖానికి మాస్క్‌ను తప్పనిసరిగా ధరించాలి. శరీరానికి తగలకుండా జాగ్రత్తపడాలి. మందు పొగను పీల్చడం ప్రమాదకరం కాగా రైతులు గాలి వచ్చే దిశలో పిచికారి చేయాలి. మందును మోతాదుకు మించి పిచికారి చేస్తే విష ప్రభావం అధికంగా ఉంటుంది. శ్వాస కోస వ్యవస్థకు హాని జరగకుండా రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

రైల్వే గేట్ల మధ్య చిక్కుకున్న కారు

● గేట్‌మన్ సమయస్ఫూర్తితో తప్పిన ప్రమాదం



రైల్వే గేటు లోపల చిక్కుకున్న కారు

కొడిమ్యాల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్-జగిత్యాల ప్రధాన రహదారిపై కొడిమ్యాల మండలం నమిళికొండ గ్రామ శివారులో శనివారం రైల్వేగేట్ల మధ్య కారు చిక్కుకుంది. రైలు వస్తుందన్న సమాచారంతో గేట్‌మన్ రైల్వే గేట్ వేసి రైలుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. అదే సమయంలో కరీంనగర్ నుంచి జగిత్యాల వైపువెళ్తున్న కారుగేటు లోపలికి చేరుకుంది. రెండు వైపులా గేట్లు మూసుకున్నాయి. ప్రమాదాన్ని పసిగట్టి అప్రమత్తమైన గేట్‌మన్ సిగ్నల్‌తో కొంతసేపు రైలును నిలిపివేసినట్లు నమిళికొండ గ్రామస్థులు తెలిపారు. అనంతరం రైల్వేగేట్లను తెరవడంతో కారు బయటకు వెళ్లిపోయింది. దీంతో పెను ప్రమాదం తప్పింది.

మొబైల్ ఫోన్ దొంగిలించి డబ్బులు డ్రా చేసిన వ్యక్తి అరెస్ట్



దొంగను అరెస్ట్ చూపుతున్న ఎస్పీ మహేష్ బి గీతే

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మొబైల్ ఫోన్ దొంగిలించి ఫోన్ పే ద్వారా డబ్బులు డ్రా చేస్తూ మోసాలకు పాల్పడుతున్న పశ్చిమ బెంగాల్ రాష్ట్రం అలీపూర్‌జిల్లా పున్సపర గ్రామానికి చెందిన బర్మన్ హరి(32)ని అరెస్ట్ చేశామని ఎస్పీ మహేష్ బి గీతే తెలిపారు. శనివారం రాత్రి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బర్మన్ అనేవ్యక్తి ఇంటర్ వరకు చదువుకుని దురలవాట్లకు అలవాటుపడి మొబైల్స్ దొంగిలించి అందులో ఉన్న ఆధార్ కార్డు, పాన్‌కార్డుల సహాయంతో ఫోన్ పే, గుగూల్‌పే పాస్వర్డ్ రీసెట్ చేసి డబ్బులు వేరే అకౌంట్‌కి పంపించుకుంటాడు. ఈ డబ్బుతో జల్సా చేసేవాడు. ఇందులో భాగంగా రుద్రంగి మండలం మానాల గ్రామానికి చెందిన సిరికొండ శ్రీనివాస్ అనేవ్యక్తి 12 మార్చి 2025న రైలులో తిరుపతి వెళ్తున్న క్రమంలో అతనిభార్య ఫోన్‌ను దొంగిలించాడు. ఆ ఫోన్‌లో ఉన్న ఫోన్‌పే ద్వారా పలు దఫాలుగా తన అకౌంట్లో నుంచి రూ.5.12లక్షలు మరో అకౌంట్‌కు బదిలీ చేశాడు. బ్యాంకు స్టేట్‌మెంట్ ద్వారా శ్రీనివాస్ రుద్రంగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ శ్రీనివాస్ కేసు నమోదు చేశాడు. ఈ కేసు విచారణలో భాగంగా చందుర్తి సీఐ వేంకటేశ్వర్లు, జిల్లా సైబర్ క్రైమ్ ఆర్‌ఎస్‌ఐ జునైద్, కానిస్టేబుళ్లు కిట్టు, మహేశ్, గంగిరెడ్డి, రాజు అధ్వర్యంలో స్పెషల్ టీం ఏర్పాటు చేసి సాంకేతికత ఆధారంగా నిందితుడు బర్మన్ హరిని విజయవాడలో అరెస్ట్ చేసి రిమాండ్ తరలించినట్లు ఎస్పీ తెలిపారు.

గంజాయి అమ్మడానికి వచ్చిన యువకుడి అరెస్టు



నిందితుడి అరెస్టు చూపుతున్న సిరిసిల్ల రూరల్ సీఐ

ఇల్లంతకుంట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గంజాయిని అమ్మడానికి వచ్చిన మాతంగి మనీష్ అనే యువకుడిని అరెస్టు చేసినట్లు సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి తెలిపారు. సీఐ తెలిపిన వివరాలప్రకారం.. చింతలకుంట గ్రామానికి చెందిన మనీష్ కరీంనగర్‌లోని ఓ వాటర్‌ప్లాంటులో పని చేస్తూ మత్తుకు, జల్సాలకు అలవాటుపడ్డాడు. త్వరగాడబ్బులు సంపాదించాలనే ఆలోచనతో కరీంనగర్‌లోని ఓ వ్యక్తి వద్ద గంజాయిని కొనుగోలుచేసి ఇల్లంతకుంటలో అమ్మడానికి శనివారం వస్తున్నాడనే సమాచారం మేరకు బతుకమ్మతెప్ప వద్ద పోలీసులు వాహనాలు తనిఖీలు చేశారు. తనిఖీలలో మనీష్ పట్టుబడగా, అతని వద్ద 110గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని అరెస్టుచేసినట్లు తెలిపారు. సమావేశంలో ఎస్సై శ్రీనివాస్‌రావు సిబ్బంది పాల్గొన్నారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

కోల్‌సిటీ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని జ్యోతినగర్‌లో నివాస ముండే బండారి రాకేష్(30) అనే యువకుడు శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గతంలో రాకేష్ మెకానిక్‌గా పని చేసే వాడు. కొంతకాలంగా అనారోగ్య కారణాలు, మానసికస్థితి సరిగా లేకపోవడంతో చికిత్స చేసుకుంటున్నట్టు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. వన్‌టౌన్ ఎస్‌ఐ రమేష్ ఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మానకొండూర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోచంపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటార్ సైకిలిస్టు మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని మద్దికుంట గ్రామానికి చెందిన కెక్కర్ల సురేష్(27) అనే యువకుడు కరీంనగర్‌లోని ఓ షోరూంలో పని చేస్తున్నాడు. ఎప్పటిలాగే శనివారం మద్దికుంట నుంచి కరీంనగర్‌కు తన మోటార్ సైకిల్‌పై కరీంనగర్‌కు వెళ్లి రాత్రి పని ముగించుకొని మద్దికుంటకు బయలుదేరాడు. మండలంలోని పోచంపల్లి వద్ద రోడ్డుపై టిప్పర్ ఆగి ఉంది. రాత్రి టిప్పర్ కనిపించకపోడంతో వెనకాల నుంచి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో సురేష్‌కు తీవ్ర గాయాలు కాగా గ్రామస్థులు చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య ప్రియాంక, రెండేళ్ల కూతురు ఉన్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని రోడ్డు ప్రమాదానికి గల కారణాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సంజీవ్ తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న ముఠా అరెస్ట్

● 2.1 కిలోల గంజాయి, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం



నిందితులను అరెస్టు చూపిస్తున్న డీఎస్పీ రఘు చందర్

జగిత్యాల క్రైం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ముఠాను శనివారం జగిత్యాల జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. ఐదుగురి నుంచి 2.150 కిలోల గంజాయి, రెండు ద్విచక్ర వాహనాలతో పాటు ఐదు సెల్‌ఫోన్లను పోలీసులు సీజ్ చేశారు. ఒకరు పరారీలో ఉన్నారు. జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ శనివారం వివరాలు వెల్లడించారు. కొడిమ్యాల, జగిత్యాల పట్టణ ఎస్సైలు సందీప్, రవి కిరణ్‌లు తమ సిబ్బందితో పూడూర్‌తో పాటు మిషన్ కాంపౌండ్ ప్రాంతాల్లో సోదాలు చేశారన్నారు. పూడూర్‌లో ఇద్దరు, మిషన్ కంపౌండ్‌లో ముగ్గురు యువకులు గంజాయితో పట్టుబడ్డారన్నారు. కొడిమ్యాల మండలం పూడూర్ గ్రామానికి చెందిన గుండు ప్రశాంత్, మల్యాల మండలం తాటిపెల్లి గ్రామానికి చెందిన బాలె నవీన్, గంగాధర మండలం వెంకటాయపల్లికి చెందిన వంశీ అనే ముగ్గురితో పాటు జగిత్యాల పట్టణంలోని లింగంపేటకు చెందిన ఆవునూరి రణధీర్, తులసీ నగర్ ప్రాంతానికి చెందిన ఆకుల అమర్నాథ్, రాయరపు మల్లికార్జున్ అనే ఆరుగురు యువకులు వేర్వేరుగా రెండు ముఠాలుగా ఏర్పడ్డారని తెలిపారు. సులువుగా డబ్బు సంపాదించేందుకు ఇతర ప్రాంతాల నుంచి గంజాయిని జగిత్యాల జిల్లాకు తీసుకవచ్చి విక్రయిస్తున్నారన్నారు. ఛత్తీస్‌గడ్‌లోని డోర్నకల్, మహారాష్ట్రలోని నాగ్‌పూర్ ప్రాంతం నుంచి బైక్, ట్రైన్‌లో వెళ్లి 3కిలోలగంజాయిని కొనుగోలు చేసి జగిత్యాలజిల్లాకు తీసుకవచ్చినట్లు డీఎస్పీ వివరించారు. జిల్లాలోని కొడిమ్యాల మండలం పూడూర్, పట్టణం లోని మిషన్ కంపౌండ్‌లో ఆరుగురు ముఠా సభ్యుల్లో వంశీ అనే యువకుడు పరారీలో ఉండగా మిగతా ఐదుగురు యువకులు గంజాయి సేవించే వ్యక్తులకు విక్రయించేందుకు రాగా పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వివరించారు. సమావేశంలో జగిత్యాల టౌన్, మల్యాల సీఐలు కరుణాకర్, రవి, ఎస్సైలు రవి కిరణ్, సందీప్, హెడ్‌కానిస్టేబుల్ శంకరయ్య, సిబ్బంది మహేష్ కుమార్, అరుణ్, కిరణ్, రాకేష్ తదితరులు ఉన్నారు.

రైతులకు సాగునీరివ్వండి

● లేని పక్షంలో మంత్రుల పర్యటనను అడ్డుకుంటాం
● మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

కరీంనగర్ టౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): చేతులెత్తి మొక్కుతున్న రైతులకు సాగునీరివ్వాలని చొప్పదండి మాజీఎమ్మెల్యే సుంకె రవిశంకర్ రాష్ట్రప్రభుత్వాన్ని కోరారు. శనివారం ఆయన కరీంనగర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఏ మొఖం పెట్టుకుని కరీంనగర్‌కు నీటిపారు దల శాఖమంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు వస్తున్నారని ప్రశ్నించారు. కన్నెపల్లి పంపుహౌజ్ ద్వారా నీళ్లు ఎత్తిపోసి కరీంనగర్‌లో అడుగుపెట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మంత్రుల పర్యటనను అడ్డుకుంటామని హెచ్చరించారు. కాలువలు, చెరువుల్లో నీళ్లు లేక ప్రజలు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రేవంత్‌రెడ్డి ఆనాటి రోజులు అంటే నాటికాంగ్రెస్ పాలనకరువు రోజులు గుర్తు చేస్తున్నారని ప్రజలకు అర్థమవుతుందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం నీళ్లు ఎత్తిపోసి నీరందించి ప్రజల ఇబ్బందులను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

కోల్‌సిటీ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని వన్‌టౌన్ పరిధిలోని అశోక్‌నగర్‌లో ఒకఇంట్లో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు శుక్రవారం అర్ధరాత్రి తరువాత వన్‌టౌన్ పోలీసులు దాడిచేశారు. సీఐ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారివద్ద నుంచి రూ.12400నగదు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో అశోక్‌నగర్, గాంధీనగర్, హనుమాన్ నగర్, రామగిరి మండలం పెద్దంపేట గ్రామానికి చెందిన వారు ఉన్నారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకుల వాగ్వాదం



అయిలాపూర్‌లో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

కోరుట్ల రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల మండలం అయిలాపూర్‌లో కాంగ్రెస్,బీఆర్‌ఎస్ శ్రేణుల మధ్య శనివారం వాగ్వాదం జరిగింది. యూరియా పంపిణీపై కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అసత్య ప్రచారం చేస్తున్నారని, వాస్తవాలు చర్చించేందుకు ఎమ్మెల్యే అయిలాపూర్‌లోని రైతు వేదికలో బహిరంగ చర్చకు రావాలని రెండురోజుల క్రితం కాంగ్రెస్ నాయకులు సవాల్‌విసిరారు. దీంతోశనివారం నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్‌శ్రేణులు అయిలాపూర్ గ్రామానికి భారీ సంఖ్యలో చేరుకున్నారు. అప్పడికే రైతు వేదికలో కాంగ్రెస్‌సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు తన అనుచరులతో బహిరంగ చర్చకు సిద్ధమయ్యారు. దీంతో పోలీసులు గ్రామంలో భారీబందోబస్తు నిర్వహించి ఎక్కడివారిని అక్కడే అడ్డుకున్నారు. రైతు వేదికలో కాంగ్రెస్ నాయకులు ఉన్నారన్న విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్‌నాయకులు రైతువేదిక వైపు వెళ్లేందుకు ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్‌నాయకులు రైతువేదిక నుంచి బయటకువచ్చి నినాదాలు చేస్తూ బీఆర్‌ఎస్‌నాయకుల వైపు వెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. ఇరుపార్టీల నాయకులు నినాదాలు చేయడంతో ఆ ప్రాంతంలో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు పోటాపోటీగానినాదాలు చేయడంతో పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, బీఆర్‌ఎస్ శ్రేణులకు మధ్య తోపులాట చోటు చేసుకుంది. దీంతోపోలీసులు బీఆర్‌ఎస్ నాయకులను అదుపులోకి తీసుకొని కోరుట్ల సర్కిల్ పరిధిలోని పలు పోలీసు స్టేషన్‌లకు తరలించారు. అక్కడేఉన్న కాంగ్రెస్ నాయకులను సముదా యించి పంపించి వేశారు. బీఆర్‌ఎస్ నాయకులను అక్రమంగా అరెస్టు చేశారని నిరసిస్తూ ఆ పార్టీనాయకులు అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. అయిలాపూర్‌లో ఎలాంటి అవాంఛనీయ సంఘట నలు చోటు చేసుకోకుండా కోరుట్ల, మెట్‌పల్లి సీఐ సురేష్ బాబు, అనిల్‌కుమార్, ఎస్‌ఐలు భారీ బందోబస్తు నిర్వహించారు.

పెన్షన్ల కోసం భవనం ఎక్కాల్సిందే

● సిగ్నల్స్ లేక లబ్ధిదారుల ఇబ్బందులు

మెట్‌పల్లి రూరల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేయూత పథకం కింద అందిస్తున్న పింఛన్లకోసం లబ్ధిదారులు భవనాలు ఎక్కాల్సిన పరిస్థితి ఏర్పడింది. గ్రామీణ ప్రాంతాల్లో మొబైల్ సిగ్నల్స్ లేక పంపిణీలో వృద్ధులు, దివ్యాంగ, వితంతు తదితర పెన్షన్‌దారులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. శనివారం మెట్‌పల్లి మండలంలోని రంగరావుపేట గ్రామంలో పెన్షన్ కోసం గంటల కొద్దీ భవనాలపై పడిగాపులు పడాల్సి వచ్చింది. ప్రభుత్వం పింఛన్ పంపిణీలో చేయూత యాప్‌లో ముఖ గుర్తింపు తప్పనిసరి చేసింది. దీంతో పెన్షన్ పంపిణీ ప్రక్రియ మరింత ఆలస్యమవుతోంది. నూతన విధానం ప్రకారం పోస్టాఫీసు సిబ్బంది మొబైల్‌లోనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని లబ్ధిదారుల ఫొటోలను అప్‌లోడ్ చేసి పెన్షన్ చెల్లించాలి. సిగ్నల్స్ సరిగా లేకపోవడంతో నాలుగురోజుల నుంచి లబ్ధిదారులు భవనాలపై నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం సమస్యను పరిష్కరించాలని పలువురు లబ్ధిదారులు కోరుతున్నారు.



రంగరావుపేటలో సిగ్నల్ కోసం భవనం ఎక్కి దిగుతున్న వృద్ధులు, మహిళలు

కరీంనగర్‌లో పోలీసుల నాకా బందీ



నాకా బందీని పరిశీలిస్తున్న సీపీ గౌస్ ఆలం



వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీపీ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ చర్యల్లో భాగంగా కరీంనగర్ పోలీసులు నగరవ్యాప్తంగా శనివారం రాత్రి ఏకకాలంలో నాఖాబందీ నిర్వహించారు. నగరంలోని కమాన్, ఒకటోఠాణా ఎదుట, బస్టాండ్ చౌరస్తా, ఇందిరాచౌక్, రాంనగర్ ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్, రాజీవ్‌చౌక్, కోర్టుచౌరస్తా, మంచిర్యాల చౌరస్తా, నాకాచౌరస్తా, పద్మనగర్, ఎన్టీఆర్ చౌక్ తదితర 20 ప్రధానకూడళ్ల వద్ద చేపట్టిన నాకాబందీలో సుమారు 150 మంది పోలీసు అధికారులు, సిబ్బంది పాలల్గొని వాహనాల తనిఖీలు నిర్వహించారు. వాహనదారుల భద్రతను దృష్టిలో ఉంచుకొని ఈ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వాహనదారులకు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. నంబర్ ప్లేట్ లేని వాహనాలు, ట్యాంపరింగ్ చేసిన నంబర్ ప్లేట్లు ఉన్న వాహనాలు, మైనర్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, రాంగ్ రూట్ డ్రైవ్, సరైన ధ్రువపత్రాలు(డాక్యుమెంట్లు) లేని 50పైగా వాహనాలను గుర్తించి సీజ్‌చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ శాంతిభద్రతల పర్యవేక్షణలో భాగంగా తనిఖీలు చేపట్టినట్లు, భవిష్యత్‌లోనూ కొనసాగించనున్నట్లు తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, పోలీసులకు సహకరించాలని కోరారు.

సీపీఐ రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్ ఆవిష్కరణ

భగత్‌నగర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): సీపీఐ రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్‌ను శనివారం నగరంలోని సీపీఐజిల్లా కార్యాలయం బద్ధం ఎల్లారెడ్డి భవన్‌లో నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్రకార్యవర్గసభ్యులు మర్రి వెంకటస్వామి మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ)కి వందేళ్ల చరిత్ర ఉందని అన్నారు. దేశంలో, రాష్ట్రంలో బీజేపీ పార్టీని నిలువరించాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలముందు ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ నెల 19నుంచి 22వరకు మేడ్చల్ జిల్లా కేంద్రంలో రాష్ట్ర మహాసభలు, సెప్టెంబర్‌లో పంజాబ్ రాష్ట్రంలోని చండీఘడ్‌లో జాతీయ మహాసభలు జరగనున్నాయని తెలిపారు. పార్టీశ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, నాయకులు పొనగంటి కేదారి, అందె స్వామి, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, టేకుమల్ల సమ్మయ్య, బత్తుల బాబు, నాగెల్లి లక్ష్మారెడ్డి, పిట్టల సమ్మయ్య, బ్రామండ్లపెల్లి యుగేందర్, మావురపు రాజు, బోనగిరి మహేందర్, బీర్ల పద్మ, కొట్టె అంజలి, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులను ఇప్పించండి

● జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అక్కెనపల్లి కరుణాకర్


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు కరుణాకర్

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ బిల్లులను ఇప్పించాలని కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్‌ను మాజీ సర్పంచ్‌ల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అక్కెనపల్లి కరుణాకర్ కోరారు. శనివారం జిల్లాకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్‌ప్రభుత్వం ఏర్పడి 20నెలలు కావస్తున్నా ముఖ్య మంత్రి, మంత్రివర్గం, ఎమ్మెల్యేలు గ్రామాల్లో అభివృద్ధి పనులను గాలికి వది లేశారని ఆరోపించారు. జనహిత పాదయాత్రలు చేస్తున్న మీనాక్షి నట రాజన్ 2019-24వరకు తెలంగాణ గ్రామాలలో చేసిన అభివృద్ధి పనులను చూసి రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి పెండింగ్ బిల్లులను ఇప్పించాలన్నారు. ఎన్నికల సమయంలో అధికారంలోకి వస్తే సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులను చెల్లిస్తామని అప్పటి టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్‌రెడ్డి హామీనిచ్చాడని అన్నారు. గతంలో పెండింగ్ బిల్లులు చెల్లించాలని జేఏసీ ఆధ్వర్యంలో ధర్నాలు, పాదయాత్రలు, రాస్తారోకోలు చేపడితే కాంగ్రెస్ ప్రభుత్వం జేఏసీ నాయకులు, మాజీ సర్పంచ్‌లపై అక్రమ కేసులు పెట్టిందని ఉద్యమాన్ని అణచివేసిందని ఆరోపించారు. మంత్రి సీతక్క పెండింగ్ బిల్లులు రూ. 700 కోట్లు ఉన్నాయని విడతల వారిగా చెల్లిస్తామని హామీనిచ్చి ఇప్పటివరకు చెల్లించకపోవడం విచారకరమన్నారు. గ్రామాల్లో అప్పటి సర్పంచ్‌లు ప్రజల అభివృద్ధి కోసం తప్ప ఎవరి స్వంతంకోసం పనులు చేయలేదని ముఖ్య మంత్రి గ్రహించాలన్నారు. ఇప్పటికైనా మాజీ సర్పంచులకు రావాల్సిన పెండింగ్ బిల్లును చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. చొప్పదండి నియోజకవర్గంలో జనహిత పాదయాత్రలో ఉన్న మీనాక్షి నట రాజన్‌ను కలిసి సమస్యలను చెప్పుకోవడం కోసం తమకు సమయం ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో తాజా మాజీ సర్పంచ్‌ల జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గున్నాల లక్ష్మణ్, ఆరె మహేందర్, జిల్లా అధ్యక్షుడు దుమ్మ అంజయ్య, జిల్లా ఉపాధ్యక్షులు సిరికొండ శ్రీనివాస్, రవినాయక్, రాసూరి రాజేష్, చిట్నేని శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.



● మార్కెట్లోకి ఫ్రెండ్‌షిప్ బ్యాండ్స్.. బహుమతులు

● నేడు ఫ్రెండ్‌షిప్ డే..

సిరిసిల్ల/కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): స్నేహానికి మించిన బంధం ఈ లోకాన లేదు. రక్త సంబంధీకులతో ముడిపడిన బంధాలకంటే ఎలాంటి బంధుత్వం లేకపోయినా జీవితాంతం తోడునీడగా ఆప్యాయత, అనురాగాలు పంచే బంధం స్నేహం. ప్రతి ఒక్కరికి ఎవరో ఒకరు ఆప్తమిత్రులుగా ఉంటారు.

● అండగా నిలుస్తున్న స్నేహాలు..

ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్‌లో లైక్‌లు కొట్టడం, కామెంట్లు చేయడమే కాకుండా సామాజిక మాధ్యమాల ద్వారా కూడా కొంతమంది స్నేహితులు ఒక బృందంగా ఏర్పడి ఎంతో మందికి సహాయాన్ని అందిస్తూ ప్రశంసలను అందుకుంటున్నారు. ఒకరికి ఒకరు అండగా నిలుస్తున్నారు. చదువులు పూర్తిచేసి ఉద్యోగాలు చేస్తున్నవారు చదువుకుంటున్న విద్యార్థులు సైతం ఫౌండేషన్‌లుగా ఏర్పడి తోటి మిత్రులను ఆదుకుంటున్నారు. చిన్ననాటి మిత్రులందరు కలిసి తాము అక్షరాలు దిద్దుకున్న గ్రామాల్లోని పాఠశాలలను బాగు చేస్తున్నారు. స్నేహమంటే ఇది అంటూ యువత కొత్త నిర్వచనాన్ని అందిస్తున్నారు.

● ఫ్రెండ్‌షిప్‌డే నేపథ్యం ఇది..

గ్రీటింగ్ కార్డ్స్ తయారు చేసే హాల్ మార్క్ అనే సంస్థ వ్యవస్థాపకుడు జోయ్స్ సీ హాల్ స్నేహితుల దినోత్సవాన్ని నిర్వహించాలని 1919లో అనుకున్నాడు. ప్రజల్లో స్నేహ భావాన్ని పెంపొందించాలన్న ఉద్దేశంతో 1935లో అమెరికా కాంగ్రెస్ ఫ్రెండ్‌షిప్ డేను నిర్వహించాలని తీర్మానించింది. అమెరికా దేశస్తులు 1935 ఆగస్టు 6న జాతీయ స్నేహ దినోత్సవాన్ని జరుపుకున్నారు. జూలై 30ని ప్రపంచ స్నేహ దినోత్సవంగా ఐక్యరాజ్యస మితి ప్రకటించింది. మనదేశంలో మాత్రం ఆగస్టు మొదటి ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.



● మార్కెట్‌లో ఫ్రెండ్‌షిప్ డే సందడి



ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా మార్కెట్‌లో సందడి కనిపించింది. పలు ప్రాంతాల్లో వెలసిన ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌ల అమ్మకాల షాపులు జనంతో కిక్కిరిసిపోయాయి. ఆకట్టుకునే అందమైన బ్యాండ్‌లు షాపుల నిర్వాహకులు అమ్మకాలకు ఉంచారు. విద్యార్థులు, యువత ఆసక్తితో తిలకిస్తూ వాటిని కొనుగోలు చేశారు. విభిన్న రూపాల్లో ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లు కనువిందు చేశాయి. దేశ విదేశాల్లో ఉన్న మిత్రులకు ఫోన్ ద్వారా ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. యువత స్నేహితుల దినోత్సవాన్ని నిర్వహించుకునేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు అమ్మకాలు కొనసాగాయి.

ఉత్పత్తి దశలోకి ఆర్‌ఎఫ్‌సీఎల్

● 5వ తేదీ నుంచి యూరియా ఉత్పత్తి

● షట్‌డౌన్‌తో 60వేల టన్నుల ఉత్పత్తికి అంతరాయం



కోల్‌సిటీ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్(ఆర్‌ఎఫ్‌సీఎల్)లో శనివారం లైట్ అప్(ఉత్పత్తి దశ ప్రక్రియ) చేశారు. అమ్మోనియా పైప్‌లైన్ లీకేజీతో జూలై 15వ తేది నుంచి ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో యూరియా ఉత్పత్తి నిలిపివేశారు. 25వ తేదీలోగా మరమ్మతు పూర్తి చేస్తారని అంచనా వేసినా సాధ్య పడలేదు. ఆర్‌ఎఫ్‌సీఎల్ మరమ్మతుల ప్రక్రియ ప్రారంభం కావడానికే నాలుగైదు రోజుల సమయం పట్టింది. ఢిల్లీ నుంచి సీఈవో అలోక్ సింఘాల్ ప్లాంట్‌కు రావడంతో మరమ్మతులు వేగవంతమయ్యాయి. రెండు వారాలపాటు ఆయన ఆర్‌ఎఫ్‌సీఎల్‌లోనే మకాం వేశారు. పైప్‌లైన్ మరమ్మతు చేస్తున్న సమయంలో మరో డ్యామేజీని గుర్తించారు. దీంతో మరమ్మతుల్లో మరింత జాప్యం ఏర్పడింది. ప్లాంట్ షట్‌డౌన్ అయిన 18రోజుల తరువాత మరమ్మతుల ప్రక్రియ పూర్తయి శనివారం లైట్ అప్ చేశారు. ఈ నెల 5వ తేదీ నాటికి యూరియా ఉత్పత్తి ప్రారంభమయ్యే అవకాశం ఉంది. రోజుకు 3850టన్నుల యూరియా ఉత్పత్తి సామర్థ్యం గల ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో 18రోజులపాటు యూరియా ఉత్పత్తి నిలిచిపోయింది. సుమారు 60వేల టన్నుల ఉత్పత్తి నష్టం జరిగింది. రూ.60 కోట్ల వరకు పరిశ్రమకు ఆర్థిక నష్టం జరిగింది. జూలై నెలలో తెలంగాణకు 30వేల టన్నుల యూరియా సరఫరా జరుగాల్సి ఉండగా ప్లాంట్ షట్‌డౌన్‌తో కేవలం 16వేల టన్నులు మాత్రమే సరఫరా చేశారు. తెలంగాణ రాష్ట్రంతోపాటు కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాలకు యూరియా సరఫరా నిలిచిపోయింది.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు గురుకుల విద్యార్థినుల ఎంపిక


విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీలత

జగిత్యాలరూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో తిమ్మాపూర్ తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళ డిగ్రీ గురుకుల కళాశాలకు చెందిన విద్యార్థినిలు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ గునుక శ్రీలత తెలిపారు. అండర్-20 విభాగం 100 మీటర్ల పరుగు పందెంలో బి. అక్షిత, 200 మీటర్ల పరుగు పందెంలో టి. పూజ, 400 మీటర్ల పరుగు పందెంలో ఎం. సాత్వికాంజలి ప్రథమ స్థానం సాధించినట్లు తెలిపారు. ఆగస్టు 3, 4 తేదీల్లో హన్మకొండలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఎంపికైన విద్యార్థినిలను ప్రిన్సిపాల్ శ్రీలత, ఫిజికల్ డైరెక్టర్ హరిరామ్, జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి ముత్తయ్యరెడ్డి, కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, తోటి విద్యార్థినిలు అభినందించారు.

ఆలయాల్లో శ్రావణ సందడి

● ధర్మపురి, కొండగట్టు క్షేత్రాల్లో భక్తుల పూజలు


ధర్మపురిలో స్వామివారిని దర్శనం చేసుకుంటున్న భక్తులు


కొండగట్టు ఆలయ ఆవరణలో భక్తులు

ధర్మపురి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలో శనివారం భక్తులరద్దీ పెరిగింది. శ్రీలక్ష్మీనరసింహస్వామి అనుబంధ ఉగ్రనరసింహ, వేంకటేశ్వర, రామలింగేశ్వరస్వామి, గణపతి ఆలయాల్లో ఉదయం ఆలయ అర్చకులు ప్రత్యేకపూజలు చేశారు. స్వామి వారలకు పంచోపనిషత్తులతో ప్రత్యేక అభిషేకం, సప్తహారతులు, నివేదన, నీరాజన, మంత్రపుష్పాలు జరిపారు. యమ ధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయధర్మకర్తల మండలి ఛైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు. లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని జగిత్యాల జిల్లా అడిషనల్ డిస్ట్రిక్ జడ్జి నారాయణ శనివారం సందర్శించారు. ఆలయం వద్ద ఆయనకు వేదపండితులు, అర్చకులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధర్మపురి ఎస్‌ఐ ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

అంజన్న సన్నిధిలో..

మల్యాల: శ్రావణ శనివారం పురస్కరించుకొని కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం భక్తులతో రద్దీగా మారింది. వేలాదిగా భక్తులు అంజన్న సన్నిధికి వచ్చి స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేకాలు ఇతరాత్ర పూజలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

నేడు నీట్ పీజీ ప్రవేశ పరీక్ష

తిమ్మాపూర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలోని ప్రభుత్వ, ప్రైవేటు, కేంద్ర విశ్వవిద్యాలయాల్లో డాక్టర్ ఆఫ్ మెడిసిన్ (ఎండీ), మాస్టర్‌ఆఫ్‌సర్జరీ(ఎంఎస్), పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా కోర్సులలో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్ పీజీ-2025 ప్రవేశ పరీక్ష ఆదివారం జరగనుంది. ఈ పరీక్షకు సంబంధించిన ఏర్పాట్లను నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్(ఎన్‌బీఈ), పోస్ట్ గ్రాడ్యుయేట్ పరీక్షకోసం నేషన్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్ పీజీ) ఇప్పటికే పూర్తి చేసింది. ఈ పరీక్ష ఆదివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు జరగనుంది. ఈ ప్రవేశపరీక్ష ద్వారా పోస్ట్ ఎంబీ బీఎస్ డిప్లొమాట్ ఆఫ్ నేషనల్ బోర్డ్(డీఎన్‌బీ), డాక్టరేట్ ఆఫ్ నేషనల్ బోర్డ్ వంటి డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు పొందనున్నారు, ఈ పరీక్ష కోసం తిమ్మాపూర్ మండలంలో ఆయాన్ డిజిటల్ జోన్, వాగేశ్వరి, జ్యోతిష్మతి ఇంజనీరింగ్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటుచేశారు. అభ్యర్థులను పరీక్ష సమయానికి 45నిమిషాల ముందు మాత్రమే పరీక్ష కేంద్రంలోనికి అనుమతిస్తారు.

అవయవదానం సామాజిక బాధ్యత


మాట్లాడుతున్న కమిషనర్ అరుణశ్రీ

కోల్‌సిటీ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అవయవ, నేత్రదానం సామాజిక బాధ్యత అని రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ జే అరుణశ్రీ అన్నారు. శనివారం నగర పాలకసంస్థ కార్యాలయంలో మెప్మా ఆర్‌పీలకు నేత్ర, అవయవ, రక్తదానాలపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ సదాశయ ఫౌండేషన్ సమన్వయంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు, ప్రతిఒక్కరూ అవయవ, నేత్రదానానికి ముందుకు రావాలని, ఒకటినుంచి 7వరకుజరిగే తల్లిపాల వారోత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. డీఎంహెచ్‌వో అన్నప్రసన్న మాట్లాడుతూ మరణాంతరంతోపాటు జీవించి ఉండగా కొన్ని అవయవాలు దానం చేయవచ్చునని, కాలెయం, క్లోమం, వెంట్రుకలు, చర్మందానం చేయవచ్చునని, రక్తదానంపై అపోహలు వీడాలని, ఏడాదిలో కనీసం 4నుంచి 5సార్లు రక్తదానం చేవచ్చునన్నారు. ఆర్‌ఎంవో రాజు, సదాశయ ఫౌండేషన్ ప్రచారకార్యదర్శి వాసు, లింగమూర్తి, సాన రామకృష్ణారెడ్డి, మెప్మా సీవో శమంత కమణి, టీఎంసీ మౌనిక పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆసుపత్రుల తనిఖీ

సుభాష్‌నగర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): స్పెషల్‌డ్రైవ్‌లో భాగంగా నగరంలోని పలు ప్రైవేట్ ఆసుపత్రులను శనివారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్‌వెంకటరమణ బృంద సభ్యులతో కలిసితనిఖీచేశారు. ప్రైవేట్ హాస్పిటల్ పనితీరు, వారు నిర్వహించే రిజిస్టర్లు, పేషెంట్ అనుమతిపత్రాలు, కేస్‌రికార్డ్స్, సంబంధిత డాక్యుమెంట్స్‌ను పరిశీలించారు. నిపుణులైన గైనకాలజిస్టు, ఇతరక్వాలిఫైడ్ స్పెషలిస్టుల ఒరిజినల్ సర్టిఫికెట్స్, హాస్పిటల్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌ను పరిశీలించారు. ప్రైవేట్‌హాస్పిటల్స్‌లో ప్రసవాలు జరిగిన గంటలోపు తల్లిపాలు శిశువులకు అందించడంపై అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం హౌసింగ్ బోర్డులోని ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఎం హెచ్‌ఎన్ డాక్టర్ సనజ వేరియా, సీడీపీవో సబిత, పట్టణఆరోగ్యకేంద్రం వైద్యాధికారి సాయిప్రసాద్ పాల్గొన్నారు.

ఆకాశం వైపు అన్నదాత చూపు

● మెట్ట ప్రాంతాల్లో ముందుకు సాగని వ్యవసాయం ● ఎండలకు వాలిపోతున్న పత్తి.. బీడుగా పొలాలు


కాట్రపల్లిలో నీళ్లు లేక బీడుగా ఉన్న పొలాలు


ఇప్పల్‌నర్సింగాపూర్‌లో వడలిపోతున్న పత్తి

హుజూరాబాద్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మెట్టప్రాంత రైతులు వర్షాల కోసం ఆకాశం వైపు ఎదురుచూస్తున్నారు. పదిరోజులుగా విపరీతంగా ఎండలు కొడుతుండడంతో పత్తిపంటలు వాలిపోతున్నాయి. రైతులు పోసిన నార్లు ముదిరిపోతున్నాయి. వ్యవసాయం ముందుకు సాగకుండా పొలాలన్నీ బీడుగా మారాయి. అడపాదడపా కురిసిన వర్షాలకు రైతులు దుక్కులు దున్నుకొని పత్తి రైతులు గింజలు విత్తారు. అప్పుడప్పుడు కురిసిన ముసురులకు పత్తి ఓ మాదిరిగా ఉండగా, పదిరోజులుగా కొడుతున్న ఎండలకు వాలిపోతున్నాయి. గత సంవత్సరం ముందుగా పత్తి సాగుచేసిన రైతులకు దిగుబడులు ఆశాజనకంగా వచ్చాయి. ఈ సంవత్సరం కేంద్రప్రభుత్వం పత్తికి మద్దతుధర క్వింటాల్‌కు రూ.589పెంచడంతో పత్తిసాగుకు రైతులు మొగ్గు చూపారు. గత సంవత్సరం పత్తిక్వింటాల్‌కు రూ.7521 మద్దతు ధరఉండగా, ఈ ఏడాది పొడవైన పత్తికి రూ.8110, సాధారణ పత్తికి క్వింటాల్ రూ.7710 మద్దతుధర ప్రకటించింది. అలాగే మెట్టప్రాంతంలోని రైతులు వర్షాలు కురుస్తాయనే ఉద్దేశ్యంతో వరినార్లు పోశారు. అవికాస్త ముదిరిపోయే దశకు చేరుకుంది. ఈ సంవత్సరం పెద్దగా వర్షాలు కురిసిన దాఖలాల్లేవు. బావులు, బోర్లలో భూగర్భజలాలు పెరగకపోవడంతో రైతులు పొలాలు దున్నక బీడులుగానే ఉంచారు. మెట్టప్రాంతాల్లో వర్షం పడితేనే వ్యవసాయపనులు ముందుకు సాగనున్నాయి. మరోవారం రోజుల్లో వరినాట్లు వేయకుంటే పోసిన వరినారు ఎందుకూ పనికిరాకుండా పోతుందని రైతులు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు చెరువు, కుంటల్లోకి నీళ్లు వచ్చిన సందర్భాలు లేవు. డివిజన్‌లోని జమ్మికుంట, హుజూరాబాద్, ఇల్లందకుంట, వీణవంక, సైదాపూర్, శంకరపట్నం మండలాలు ఉండగా, 1.20లక్షల ఎకరాల్లో సాగుభూమి ఉంది. అందులో సుమారు 20వేలఎకరాల్లో పత్తి, 80 ఎకరాల్లో వరి, 20వేల ఎకరాల్లో ఇతర పంటలు సాగు చేస్తున్నారు. వర్షాలు పడితేనే పంటలు పండే అవకాశంఉంది. లేనియెడల రైతులు అప్పుల్లో కురుకుపోయే పరిస్థితి నెలకొంది.

● **నీటి కోసం ఎదురుచూపులు..**

హుజూరాబాద్ ఎస్సారెస్పీ ఆయకట్టు కింద నీళ్లు వస్తాయనే ఉద్దేశ్యంతో రైతులు కొద్దిపాటి కురిసిన వర్షాలకు, బావుల్లోఉన్న నీటితో కొంత మేర పొలాలు దున్ని నాట్లువేశారు. మిగితా రైతులు నీళ్లలేక పొలాలన్నీఅలాగే వదిలేశారు. ఇప్పటివరకు ఆయకట్టుకింద 50శాతం మాత్రమే వరినాట్లు వేశారు. ఆయకట్టు కిందనాట్లు వేసిన రైతులు నీళ్లలేక పొలాలు పారకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఎల్ఎండీ నీళ్లకోసం ఎదురుచూస్తున్నారు.

ఎస్సారెస్పీకి స్వల్పంగా వరద

● ప్రాజెక్టులోకి 4,352 క్యూసెక్కుల నీరు రాక

జగిత్యాల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి శనివారం స్వల్పంగా వరద నీరు వచ్చింది. డ్యామ్‌లోకి 4,352 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వాటర్ వచ్చి చేరింది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 39.188 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ అవసరాలకు, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 774 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1 నుంచి ఇప్పటి వరకు ప్రాజెక్టులోకి 29.690 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టు నుంచి వివిధ అవసరాల నిమిత్తం 3.485 టీఎంసీల నీరును వ్యయం చేశారు.

నాందేడ్ టు తిరుపతి ప్రత్యేక రైలు సమయంలో మార్పు

కరీంనగర్ రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నెలరోజుల పాటు నాందేడ్ టు తిరుపతి, తిరుపతి టు నాందేడ్ నడిచే ప్రత్యేకరైలు రాకపోకల సమయంలో మార్పులుచేస్తూ దక్షిణమధ్య రైల్వే అధికారులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. గతనెల26 నుంచి నాందేడ్ నుంచి కరీంనగర్ మీదుగా తిరుపతికి ప్రత్యేక రైలును నడిపిస్తున్నట్లు, ఈనెల 2నుంచి జగిత్యాల, కరీంనగర్ రైల్వేస్టేషన్లకు వచ్చే సమయంలో మార్పులు చేసినట్లు పేర్కొన్నారు. నాందేడ్‌లో ప్రతీ శనివారం సాయంత్రం 4.50 గంటలకు బయల్దేరి ముదుఖేడ్, బాసర, నిజామాబాద్ మీదుగా జగిత్యాలకు రాత్రి 8:30 గంటలకు, కరీంనగర్‌కు రాత్రి 9 గంటలకు చేరుకుంటుందని పేర్కొన్నారు. మరుసటిరోజు ఆదివారం ఉదయం 11:30 గంటలకు తిరుపతికి చేరుకుంటుందని, అదేరోజు సాయంత్రం 4గంటలకు తిరుపతి నుంచి బయల్దేరి మరుసటి రోజు సోమవారం ఉదయం 9.08గంటలకు కరీంనగర్ చేరుకొని నాందేడ్ బయల్దేరుతుందని పేర్కొన్నారు. ఈ నెలలో ప్రతీ శనివారం 2, 9, 16, 23, 30తేదీల్లో నాందేడ్ నుంచి తిరుపతికి, ప్రతీ ఆదివారం 3, 10, 17, 24, 31 తేదీల్లో తిరుపతి నుంచి నాందేడ్‌కు రైలు నడుస్తుందని తెలిపారు. రైలు రాకపోకల సమయంలో మార్పుతతో కరీంనగర్, జగిత్యాల రైల్వే స్టేషన్లకు గతంలో కంటే అరగంట ముందుగా చేరుకుంటుందని కరీంనగర్ రైల్వే స్టేషన్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ భానుచందర్ పేర్కొన్నారు.

విద్యార్థులకు సంగీతంలో శిక్షణ

● పీఎం శ్రీ పథకంలో పాఠశాలలు ఎంపిక

● ఈ విద్యాసంవత్సరం నుంచే అమలు

కరీంనగర్ టౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువుతో పాటు తమకు అభిరుచి ఉన్న కళారంగంలో రాణించడానికి సంగీతంపై శిక్షణ ఇచ్చేందుకు విద్యాశాఖ ప్రణాళిక రూపొందించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల పరిపూర్ణ అభ్యసనకు దోహదపడే అంశాలను వారికి అందుబాటులోకి తెచ్చి పాఠశాల విద్యను బలోపేతం చేస్తున్నాయి.



ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎం శ్రీ) యోజన ద్వారా రాష్ట్రంలో 832 బడులు ఎంపికయ్యాయి. కరీంనగర్ జిల్లాలో 22 ప్రభుత్వ పాఠశాలు ఎంపిక కాగా సంగీత తరగతులు నిర్వహించడానికి తొలి విడతలో 13, రెండో విడతలో తొమ్మిది పాఠశాలలను ఎంపిక చేశారు. ఈ పాఠశాలల్లో విద్యార్థులకు వివిధ మ్యూజిక్ క్లాసులు చెప్పించాలని, రాష్ట్ర విద్యాశాఖ నిర్ణయించింది. వీటిలో కొన్ని పాఠశాలలకు వయోలిన్, తబలా, మృదంగం, హార్మోనియం, మరికొన్ని పాఠశాలలకు బ్యాండ్ సంగీత పరికరాలను అందించనున్నారు. పీఎం శ్రీ పథకం కింద ఎంపిక చేసిన ఒక్కో పాఠశాలకు లక్ష రూపాయల చొప్పున అందనున్నాయి. ఈ మేరకు ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు ఆసక్తి ఉన్న విద్యార్థులకు సంగీతాన్ని నేర్పించనున్నారు. వారానికి ఒక క్లాస్ చొప్పున ఆయా పరికరాలతో శిక్ష ఇప్పిస్తారు. త్వరలో సంగీత తరగతుల నిర్వహణపై ఎంపికైన పాఠశాలల హెచ్‌ఎంలు, ప్రిన్సిపాల్స్‌కు శిక్షణ ఇస్తారు.

● సంగీత బోధనకు ఉపాధ్యాయులు

సంగీత పాఠాలు చెప్పేందుకు పాఠశాలల్లో ఒక ఉపాధ్యాయుడిని కాంట్రాక్టు పద్ధతిలో నియమించాలని అధికారులు భావిస్తున్నారు. దానికి సంబంధించిన పూర్తి మార్గ దర్శకాలు వచ్చిన తర్వాత జిల్లా అధికారులు పర్యవేక్షణలో సంగీత పాఠాలు నేర్పిస్తారు.

చిట్టి చేతులతో విత్తన బంతులు

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మండలం తిమ్మాపూర్ గ్రామంలోని ప్రాథమికపాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులచే శనివారం విత్తన బంతులు తయారు చేయించారు. వీటిని అటవీ అధికారుల సమక్షంలో విద్యార్థుల చేత స్థానిక కొండ ప్రాంతంలోని అటవీ భూమిలో వెదజల్లించారు. విత్తన బంతులను తయారు చేయించిన పాఠశాల ఉపాధ్యాయుడు వేణుగోపాల్‌ను అటవీ అధికారులు అభినందించారు.

కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ చైతన్యశ్రీ, బీట్‌అధికారి మధుసూదన్, ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, ఉపాధ్యాయులు వేణుగోపాల్, నరేష్, అశోక్, స్వామి, రాజేంద్ర ప్రసాద్, భూలక్ష్మి, సుమతి పాల్గొన్నారు.


విత్తన బంతులు వెదజల్లుతున్న విద్యార్థులు

హనుమాన్ ఆలయంలో పూజలు

రాయికల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని హనుమాన్ దేవాలయంలో శ్రావణ శనివారం సందర్భంగా భక్తుల రద్దీ నెలకొంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దేవాలయ చైర్మన్ దాసరి గంగాధర్, ఈవో ముద్దం విక్రమ్ గౌడ్‌లు సౌకర్యాలు కల్పించారు. ఆలయ అర్చకులు మునుగోటి భరత్ శర్మ, మునుగోటి సత్యనారాయణ శర్మ, దేశరాజు సంతోష్ శర్మలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు రాయిల్ల ప్రభాకర్, ఒజ్జల రాజరెడ్డి, నోముల జ్యోతి, సందెల గణేష్, కల్లెడ రాజు, సిర్ప మణిదీప్, కాంగ్రెస్ నాయకులు కొయ్యడి మహిపాల్ రెడ్డి, దివాకర్ రెడ్డి, కడకుంట్ల నరేష్, బత్తిని నాగరాజు, మచ్చ శేఖర్, బొమ్మకంటి నవీన్, బొద్దుల శివ తదితరులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

కొడిమ్యాల, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన కడారి అంజలి బ్యాంక్ లింకేజీ ద్వారా 67వేల రూపాయలు, శ్రీనిధి ద్వారా 75వేల రూపాయలను తీసుకొని ఇటీవల మృతి చెందగా ఆమె తల్లికి శనివారం 67వేల రూపాయల చెక్‌ను యూనియన్ బ్యాంక్ మేనేజర్ సంజీవ్‌కుమార్ అందించారు. ఈ సందర్భంగా మేనెజర్ మాట్లాడుతూ తీసుకున్న రుణాలను వాయిదాలలో చెల్లిస్తూ అకాల మృతి చెందగా తీసుకున్న రుణాలను తెలంగాణ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. చెల్లించిన నగదును తిరిగి ఇచ్చింది మేనెజర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో గజానన్, సబ్ మేనేజర్ సందీప్‌కుమార్, క్యాషియర్ శ్రీనివాస్, గోల్డ్ అప్రైజర్ స్వామి, వీవోఏ పూర్ణిమ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

రాయికల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని విజ్డమ్ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. జగిత్యాల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం మెట్‌పల్లి మినీ స్టేడియంలో నిర్వహించిన గర్ల్స్ లాంగ్ జంప్ విభాగంలో చిదుమల్ల శాన్విక ప్రథమ స్థానం, 60 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం, బాయ్స్ లాంగ్ జంప్‌లో గణపతి కళ్యాణ్ కృష్ణ ద్వితీయ స్థానం సాధించాడు. జనగామలో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్తయ్య రెడ్డి తెలిపారు. విద్యార్థులను కరస్పాండెంట్ ఎద్దండి ముత్యంపు రాజు రెడ్డి, డైరెక్టర్ నివేదిత రెడ్డి, అభినందించారు.

లక్ష్మీపూర్ వాసికి డాక్టరేట్

గొల్లపెల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన గుడ్ల మహేష్ వ్యవసాయ శాస్త్రంలో పీహెచ్‌డి డిగ్రీ పూర్తి చేసి డాక్టరేట్ పొందారు. రాష్ట్ర రాజధానిలోని రాజేంద్రనగర్‌లో ఉన్న తెలంగాణ విశ్వవిద్యాలయంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు. మహేష్‌ను గ్రామస్థులు అభినందించారు.

'చిన్నారులకు తల్లిపాలు శ్రేయస్కరం'


వెల్గటూర్‌లో చిన్నారులకు అన్నప్రాసన చేస్తున్న మంత్రి అడ్లూరి, కలెక్టర్

వెల్గటూర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): తల్లి పాలు బిడ్డకు శ్రేయస్కరమని, పుట్టిన గంట లోపు బిడ్డకు ముర్రు పాలు పట్టడం వలన బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. శనివారం వెల్గటూర్‌లో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా జరిగిన కార్యక్ర మానికి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కలెక్టర్ బి. సత్య ప్రసాద్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆగష్టు మొదటి వారంలో తల్లి పాల వారోత్సవాలు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం తల్లిపాల యొక్క ప్రాముఖ్యతను తెలియజేసే పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం స్థంభంపల్లి దివ్యాంగుడికి సుమారు రూ.1,20,000 విలువగల స్కూటీని ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి నరేష్, పతక శిశు సంక్షేమ అధికారిణి శ్రీ వాణి, ఏఎంసీ చైర్మన్ గోపిక జితేంధర్ రెడ్డి, సూపర్వైజర్లు పవిత్ర, అండాలు, పోషణ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ మధు, ఎఫ్ఆర్‌ఓ కొండయ్య, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

●**జగిత్యాల అగ్రికల్చర్:** తల్లిపాలు బిడ్డకు అమృతం లాంటివని పుట్టిన గంటలోపు బిడ్డకు తల్లిపాలు తాగించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవితరాణి అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా శనివారం పట్టణంలోని కాపువాడ, చిలుకవాడ అంగన్వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాల వారోత్సవాలను ప్రపంచవ్యాప్తంగా ఆగష్టు ఒకటి నుంచి ఏడు వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తూ, అవగాహన కల్పించడం జరుగు తుందన్నారు. పుట్టిన గంటల్లోపే పిల్లలకు ముర్రుపాలు తాగించడం ద్వారా బిడ్డకు రోగనిరోధక శక్తి పెరుగుతుందని, బిడ్డకు తల్లిపాలు ఒక వ్యాక్సీన్ లాగా పనిచేస్తాయన్నారు. బిడ్డకు ఆరు నెలలు తర్వాత తల్లిపాలతో పాటు, అనుబంధ పోషకాహారాన్ని అందించాలని సూచించారు. గర్భిణీగా ఉన్నప్పటి నుంచి తల్లి పోషకాహారాన్ని తీసుకోవాలన్నారు. గర్భిణిలకు సామూహిక శ్రీమంతాలు, పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ టీచర్లు దయావతి, పవిత్ర, ఏఎన్ఎం శిరీష, ఆశ, లావణ్య, స్వరూప తో పాటు తల్లులు పాల్గొన్నారు.

●**పెగడపల్లి:** తల్లి పాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందని, బిడ్డ పుట్టగానే ముర్రు పాలు తాగించాలని పెగడపల్లి మండల అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుభద్ర పేర్కొన్నారు. శనివారం పెగడపల్లి మండలంలోని అయిత్‌పల్లి గ్రామంలోని మూడవ అంగన్వఆడీ కేంద్రంలో తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లి పాల ప్రాధాన్యతను గూర్చి వివరించారు. పిల్లలకు కనీసం ఆరు నెలలు తల్లి పాలు పట్టించాలని, డబ్బా పాల కంటే తల్లి పాలే బిడ్డకు రోగ నిరోదక శక్తిని పెంచుతాయన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, బాలింతలు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

●**కొడిమ్యాల:** పుట్టిన వెంటనె శిశువుకు ముర్రు పాలు పట్టించాలని అంగన్‌వాడీ టీచర్లు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని 6వ, 10వ అంగన్‌వాడీ కేంద్రాలలో తల్లి పాల వారోత్సవం నిర్వహించారు. ఈ సందర్బంగా అంగన్‌వాడీ టీచర్లు మాట్లాడుతూ ముర్రు పాలతోనె శిశువు జీవితాంతం సరిపడా నిరోధక శక్తి అందుతుందన్నారు. తల్లి పాలలో నీటి శాతం ఉన్నందున ఆరు నెలల వరకు శిశువుకు ఎలాంటి ద్రవ, ఘన పదార్థాలను ఇవ్వకూడదన్నారు.

శిశువుకు ఆరు నెలలు నిండిన తర్వాత అనుబంద ఆహారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు గడ్డం విజయలక్ష్మీ, స్వప్న, ఎన్ఎంలు రాజేశ్వరీ, రాధ, హెల్పర్ పద్మ, కౌసల్య, ఆశావర్కర్లు శ్యామల, పద్మ, జీవలక్ష్మీ, ఏసులత, సత్య, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

'పీఎం ఉష'తో మహర్దశ

(5వ పేజీ తరువాయి)

బీజడ్‌సీ, బీజడ్‌సీ కంప్యూటర్, ఎంపీసీఎస్ తదితర కోర్సుల్లో 38 మంది అధ్యాపకులు బోధన చేస్తున్నారు. న్యాక్ బృందం కళాశాలను పరిశీ లించి ఇచ్చిన గ్రేడ్ ప్రకారం యూజీసీ పదేళ్ల పాటు స్వయం ప్రతిపత్తి హోదా (అటానమస్)ను కల్పిస్తూ గత యేడాది ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సంవత్స రం బ్యూటీషియన్ కోర్సును కూడా ఆరంభిస్తున్నారు. కంప్యూటర్ నాలెడ్జ్‌పై శిక్షణ ఇవ్వనున్నారు. జగిత్యాల జిల్లాలో అటానమస్ హోదాను సాధించిన ఏకైక కళా శాలగా జగిత్యాల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల నిలిచింది. గత సంవత్సరంతో పోల్చితే అటానమస్ సాధించిన తర్వాత ఈ సంవత్సరం అడ్మిషన్లలో 19.1 శాతం ప్రగతిని సాధించింది. ఇటీవల విడుదల చేసిన రెండో సెమిస్టర్ పరీక్షల ఫలితాల్లో సైతం శాతవాహన విశ్వవిద్యాలయం ఫలితాల కంటే 24 శాతం అధికంగా సాధించింది.

మారనున్న కళాశాల రూపురేఖలు..

-రామకృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్, జగిత్యాల



పీఎం ఉష కింద మంజూరైన నిధులతో కళాశాలలో వసతులు మెరుగు పడనున్నాయి. బీఎస్సీ, బీకాం, కంప్యూటర్ సైన్స్ విద్యార్థుల కోసం కళాశాల సెమినార్ హాల్‌లో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేస్తున్నాం. కార్పొరేట్‌కు దీటుగా విద్యా బోధన అందించే ప్రయత్నం చేస్తున్నాం. 12 అదనపు తరగతి గదుల నిర్మాణం తర్వాత మరింత మెరుగైన గుణాత్మక విద్యను విద్యార్థులకు అందిస్తాం.

పనుల్లో నాణ్యత ఉండేలా పర్యవేక్షణ

-జి.చంద్రయ్య, పీఎం ఉష కళాశాల కోఆర్డినేటర్, జగిత్యాల



పీఎం ఉష కింద మంజూరైన నిధులతో చేపట్టే అదనపు తరగతి గదుల నిర్మాణాలు టీజీఈడబ్ల్యూఐడీసీ ఇంజనీర్ల సహకారంతో నాణ్యతగా జరిగేలా పర్యవేక్షిస్తాం. మొదటి భవనానికి మొదటి స్లాబ్ నిర్మాణం పూర్తి అయ్యింది. రెండవ భవన నిర్మాణం ఇంకా పునాది దశలో ఉంది. వచ్చే విద్యా సంవత్సరం వరకు ఈ అదనపు తరగతి గదులను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకు వచ్చేలా కృషి చేస్తాం.

'సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి'

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలంలోని సీజనల్ వ్యాధుల పట్ల పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలని మండల పశు వైద్యాధికారి మనీషాపటేల్ అన్నారు. పశువైద్య, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని వెల్లుల్ల గ్రామంలో ఉచితంగా గొర్రెలకు బ్లూటంగ్, నీలి నాలుక, నోటి వాపు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మనీషా మాట్లాడుతూ వర్షాకాలంలో ఈ వ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందని, దీంతో గొర్రెల పోషకులు తీవ్ర నష్టాన్ని కలుగజేస్తుందన్నారు. ఆర్బి వైరస్ వల్ల వచ్చే వ్యాధి క్యూలికాయిడ్ కీటకాలు కుట్టడం వల్ల వ్యాపిస్తుందన్నారు. వ్యాధి లక్షణాలు 107.5 ఫారెన్‌హీట్ వరకు జ్వరం, గొర్రె ముఖంతో పాటు పెదాలు, ముక్కు, దవడ, కనురెప్పలు, నాలుక వాపు వచ్చి ఉబ్బినట్లుగా కనిపిస్తాయన్నారు. నివారణలో భాగంగా వ్యాధి లక్షణాలను బట్టి జ్వరం, నొప్పులు, కుంటడం ఎక్కువగా ఉంటే యాంటీ పైరటిక్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ మందులు, నోటి పుండ్లు, వాపులు తగ్గించడానికి డైయూరిటిక్, ముఖ భాగాలను పొటాషియం పర్మాంగనేట్ ద్రావణంతో శుభ్రం చేయాలని, వ్యాధుల నివారణకు ముందస్తుగా గమనించి టీకాలు వేయించాలని రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది రమణయ్య, దిలీప్, పశుపోషకులు, తదితరులు పాల్గొన్నారు.

పాస్‌బుక్ ఉంటేనే యూరియా అందించాలి

● **జిల్లా సహకార అధికారి మనోజ్‌కుమార్**


ఎరువుల నిల్వ రికార్డులను పరిశీలిస్తున్న డీసీవో మనోజ్‌కుమార్

మల్యాల, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం చూసిన తరువాతు రైతులకు యూరియా అందించాలని జిల్లా సహకార అధికారి మనోజ్‌కుమార్ సహకార సంఘాల సీఈవోలకు సూచించారు. మల్యాల మండలంలోని మల్యాల, పోతారం, తక్కళ్లపల్లి, నూకపల్లి వ్యవసాయ సహకార సంఘాలను ఆయన శనివారం సందర్శించారు. ఆయా సంఘాల పరిధిలో యూరియా విక్రయాలను పరిశీలించారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా విక్రయాలు చేపట్టాలని అన్నారు. అనంతరం రికార్డులు తనిఖీ చేశారు. డీసీవో వెంట అసిస్టెంట్ రిజిస్ట్రార్ మల్లేశం, సీఈవోలు శ్రీనివాస్, గంగాధర్, మనోజ్, అనిల్ తదితరులు ఉన్నారు.

కళాశాల మైదానంలో శ్రమదానం

కొడిమ్యాల, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి) : కొడిమ్యాల మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శనివారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వాలంటీర్లు క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. మైదానం లోని పిచ్చి మొక్కలను తొలిగించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె. వేణు, ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్ భాస్కర్, కళాశాల అధ్యపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలి

పెగడపల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ సత్తా చాటాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు లోక మల్లారెడ్డి పేర్కొన్నారు. పెగడపల్లి మండలంలోని ఆరవెల్లిలో శనివారం బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఏడాదిన్నర కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలన తదితర విషయాలను ప్రజలకు తెలియజేస్తూ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు లోక మల్లారెడ్డి న్నారు.

ఈ సమావేశంలో పార్టీ నాయకులు ఉప్పులంచ లక్ష్మణ్, బాలుసాని శ్రీనివాస్, గంగారెడ్డి, నరేందర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, నర్సింహారెడ్డి, గంగాధర్, రాజేశ్వర్ రావు, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల అరెస్ట్

కోరుట్ల రూరల్, అగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాలకు చెందిన మాజీ ప్రజాప్రతినిదులను కోరుట్ల పోలీసులు ముందస్తూ చర్యలో బాగంగా అదుపులోకి తీసుకున్నారు. అయిలాపూర్ గ్రామంలోని రైతు వేదికలో బహిరంగ చర్చ ఎమ్మెల్యే హజరు కావాలని కాంగ్రెస్ సవాలు విసురగా పోలీసులు బీఆర్ఎస్ ముఖ్య నాయకులను ముందస్తూ అరెస్టు చేసి కోరుట్ల పోలీసు స్టేషన్‌కు తరలించారు. కాగా అయిలాపూర్‌లో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకోవడంతో వారిని కథలాపూర్ పోలీసు స్టేషన్‌కు తరలించి అదుపులో ఉంచుకున్నారు.

●పోలీసులు అక్రమ అరెస్టులను నిరసిస్తూ బీఆర్ఎస్ శ్రేణులు పట్టణంలో ర్యాలీని నిర్వహించారు. సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, రైతు సమన్వయ కమిటి జిల్లా మాజీ అధ్యక్షుడు చీటి వెంకటరావు, మెట్‌పల్లి మాజీ ఎంపీపీ సాయిరెడ్డిలతో పాటు మండలంలోని మాజీ సర్పంచ్‌లు పోలీసులు స్వయం పూచికత్తపై విడుదల చేయ్యగా పోలీసు స్టేషన్ నుండి నంది చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వంకు వ్యతిరేకంగా నినాదాలు చేసారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిదులు ఉన్నారు.

●కథలాపూర్: కోరుట్ల మండలంలోని ఐలాపూర్‌లో యూరియా కొరత విషయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల మధ్య చర్చకు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా బీఆర్ఎస్ నాయకులను కథలాపూర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జిల్లా రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు చీటి వెంకట్రావు, మాజీ సర్పంచ్ రాజేశం, పిడుగు సందయ్యలను ఠాణాకు తరలించారు. తమను పోలీసులు అక్రమంగా అదుపులోకి తీసుకున్నారని నాయకులు ఆరోపించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వర్ధినేని నాగేశ్వర్‌రావు సంఘీభావం తెలిపారు.

మున్నూరుకాపు సంఘ భవనానికి నిధులు కేటాయించాలి

మెటపల్లి టౌన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి):పట్టణంలో మున్నూరుకాపు సంఘం భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరుతూ స్థానిక బీజేపీ నాయకులు. సంఘ సభ్యులు శనివారం బిజెపి రాష్ట్ర నాయకులు డా. రఘు ని కలిసి వినతిపత్రం సమరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెట్ పల్లి మున్నూరు కాపు సంఘ భవన నిర్మాణనికి ఎం పి ధర్మపురి అరవింద్ నిధుల నుండి నిధులు కేటాయించాలని కోరినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ పట్టణ అధ్యక్షులు బోడ్ల రమేష్, జిల్లా నాయకులు శ్రీకర్ గౌడ్ చింతల, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బస్సులు సమయానికి నడపాలి

కథలాపూర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాండ్ర్యాల, గంబీర్‌పూర్ గ్రామాలకు సమయానికి బస్సులు నడపాలని కోరుట్ల డిపో మేనేజర్‌కు బీజేపీ నాయకులు దాసరి జలంధర్ వినతి పత్రం అందజేశారు. ఉదయం 7 మరియు 9, సాయంత్రం 4 మరియు 5 గంటలకు బస్సులు నడిపితే విద్యార్థులు, ఉద్యోగస్థులకు సౌకర్యవంతంగా ఉంటుందని పేర్కొన్నారు. మహాలక్ష్మీ బస్సులు అదనంగా నడిపితే ప్రయాణికులకు ఇబ్బందులు ఉండవని మేనేజర్‌కు విన్నవించారు.

క్రికెట్‌లో కొడిమ్యాల క్రీడాకారుడి ప్రతిభ

కొడిమ్యాల, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): హైదరాబాదు క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ క్రీడలో మండల కేంద్రానికి చెందిన ఎర్రోజు తక్షీల్ తెలంగాణాలోనె టాప్‌గా నిలిచాడు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ రెండవ సంవత్సరం ఎంపీసీ చదువుతూ క్రికెట్ ఆటపై ఉన్న మక్కువతో హైదరాబాదులోనె క్రికెట్ ఆటపై శిక్షణ పొందుతున్నాడు. తక్షీల్ ప్రొఫెషనల్ క్రికెట్ హెచ్‌సీఏ 2డే లీగ్ మ్యాచ్‌లో 5వికెట్లతో పాటు 127 రన్‌లను సాదించాడు. థర్డ్ రౌండ్ లీగ్ మ్యాచ్‌లో తెలంగాణాలోనె టాప్‌గా నిలిచాడు. క్రికెట్‌లో సత్తా చాటిన క్రీడాకారున్ని గ్రామస్తులు అభినందించారు.

మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించాలి

ధర్మపురి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి నియోజకవర్గంలోని ప్రజల మౌళిక సదుపాయాలపై దృష్టి పెట్టాలని ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి చెందిన వేముల విక్రమ్‌రెడ్డి, ముదుగం రాజలింగు, షేర్ల మహేందర్ కోరారు. ధర్మపురి పట్టణంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్ల పరిస్థితి చూస్తే అధ్వాన్నంగా ఉందని, కనీసం దృష్టి సారించక పోవడం బాధగా ఉందని తెలిపారు. వెంటనే దృష్టి సారించి పరిష్కారం చూపించాలని ప్రభుత్వాన్ని కోరారు. లేని పక్షంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో నేరెళ్ల అంజన్నగౌడ్, తట్ల రాజు, రవి, తట్ల భీమన్న, సయ్యద్ యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

'గడి బురుజు భూములు స్వాధీనం చేసుకోవాలి'

కోరుట్ల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గడి బురుజు భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని అఖిలపక్ష నేతలు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని సి. ప్రభాకర్ భవనంలో సమావేశ ఏర్పాటు చేసుకోని పలు తీర్మాణాలు చేసారు. గడి గురుజు భూమిపై గతంలోని మున్సిపల్ కౌన్సిల్ పార్కు, కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేస్తామని తీర్మాణం చేసిందని గుర్తు చేశారు. ప్రజప్రయోజనాల కొరకు అట్టి స్థలంను వినియోగించుకోవాలని అన్నారు. భూ కబ్జా దారలనుండి భూమిని పరిరక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిల పక్ష నేతలు చెన్న విశ్వనాథం, తిరుపతి నాయక్, చింత భూమేశ్వర్, వృగారపు మురళి, అన్వర్, గజ్జెలి రాజు, గణేష్, ముజాయిత్, మహిపాల్ నాయక్ పాల్గొన్నారు.

కోర్టు భవన నిర్మాణం పరిశీలన

కోరుట్ల, అగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల పట్టణంలో నూతనంగా నిర్మాణం చేస్తున్న కోర్టు భవనంను శనివారం జిల్లా న్యాయమూర్తి పద్మావతి పరిశీలించారు. కోర్టు భవనంతో పాటు నూతనంగా నిర్మాణం చేస్తున్న భవనంను పరిశీలించి న్యాయవాదులను పలు సూచనలు సలహాలను అందించారు. ఈ కార్యక్రమంలో సబ్ కోర్టు న్యాయమూర్తి నాగేశ్వర్ రావు, కోరుట్ల మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి అరుణ్ కుమార్‌లతో పాటు బార్ అసోసియేషన్ సభ్యులు ఉన్నారు.

ఆలయానికి విరాళం

మల్యాల, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): నూకపల్లి శివారులోని ఆంజనేయస్వామి ఆలయంలో నిర్మిస్తున్న శ్రీరాముడు, సత్యనారాయణ స్వామి, సరస్వతి ఆలయం మండపం పనులకు గానుమండలంలోని రామన్నపేటకు చెందిన గడ్డం మల్లారెడ్డి రూ.1,11,111 విరాళం అందించారు.

'అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు'


ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

జగిత్యాలరూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి అన్నారు. రాబోవు మూడేళ్ల కాలంలో రాష్ట్రంలో ఇళ్లులేని నిరుపేద కుటుంబాలు ఉండబోవని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి అన్నారు. జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్ గ్రామంలో శనివారం ఇందిరమ్మ లబ్దిదారులు కవిత, శ్రీలత ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ భూమిపూజలో పాల్గొన్నారు. ఈసందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో గతంలో ఎప్పుడు లేనివిధంగా గృహనిర్మాణ కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ప్రతి నియోజకవర్గంలో 3500 ఇండ్ల నిర్మాణాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మిస్తుందన్నారు. రాష్ట్రంలో ఈ యేటా 4 లక్షల ఇండ్ల నిర్మాణాలు చేపట్టడం హర్షించదగ్గ విషయమని జీవన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ గత దశాబ్దకాలం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గృహనిర్మాణ కార్యక్రమాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారని ఆరోపించారు. ఒక రకంగా గృహనిర్మాణ శాఖనే రద్దు చేశారన్నారు. ప్రభుత్వం ఏ కార్యక్రమం చేపట్టిన స్యాచిరేషన్ ప్రాతిపదికన లబ్దిదారులను ఎంపిక చేస్తుందని తెలిపారు. రేషన్‌కార్డుల ప్రక్రియ గత ధశాబ్దకాలంలో మంజూరు చేయలేదని ఆరోపించారు. సన్నబియ్యం పంపిణీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఉచిత రవాణా, 500 లకే గ్యాస్ సిలిండర్, లాంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వంపారదర్శకంగా అమలు చేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాజంగి నందయ్య, రూరల్ మండలకాంగ్రెస్ అధ్యక్షుడు జున్ను రాజేందర్, ప్యాక్స్ వైస్ చైర్మన్ శీలం సురేందర్, మాజీ ఎంపీపీ మహేష్, నాయకులు వంశీ, సత్తిరెడ్డి, మన్మోహన్, మల్లారెడ్డి, తిరుపతిరెడ్డి, లచ్చం, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

రాయికల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. మండలంలోని ఇటిక్యాల గ్రామంలో ఇందిరమ్మ లబ్దిదారులు అరికుప్పల చిన్న లక్ష్మీ, దండవుల వెంకమ్మకు చెందిన ఇందిరమ్మ ఇళ్లకు శనివారం భూమిపూజ చేశారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనవారు వెంటనే నిర్మాణ పనులను ప్రారంబించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు గోపి రాజరెడ్డి, గుర్రం మహేందర్, బాపురపు నర్సయ్య పాల్గొన్నారు.

పరామర్శ

మండలంలోని రామారావుపల్లె మాజీ సర్పంచ్ దయ్యాల మల్లయ్య తల్లి ఇటీవల మృతి చెందగా వారి కుటుంబసభ్యులను మాజీ మంత్రి జీవన్ రెడ్డి శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా తమ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

పాఠశాలల్లో ఫ్రెండ్‌షిప్ డే

వెల్గటూర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): సృష్టిలో స్నేహ బంధంకు మించింది ఏదీ లేదని పాషిగామ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు నీలం సంపత్, విజ్ఞాన్ స్కూల్ కరస్పాండెంట్ దొరిశెట్టి మల్లేశం పేర్కొన్నారు. విద్యార్థులకు స్నేహం యొక్క గొప్ప తనాన్ని వివరిస్తూ పాఠశాలలో ఆగస్టు మొదటి ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా పాఠశాలలో శనివారం ముందస్తు వేడుకలు నిర్వహించారు. అనంతరం విద్యార్థుల చేత ఒకరికొకరికి స్నేహితుల దినోత్సవం బ్యాం డులు ధరింపజేస్తూ ప్రతిజ్ఞ చేయిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధునిక సమాజంలో కుటుంబంలోని వ్యక్తుల మధ్య దూరం అంతరాలు ఏర్పడుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో కూడా వెల కట్టలేనిది విలువైనది స్నేహం మాత్రమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మహేష్, రమ్యశ్రీ, రజిత, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల క్షేత్ర పర్యటన

గొల్లపల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శ్రీరాముల పల్లె ఎంపీపీఎస్ విద్యార్థులు ప్రధానోపాధ్యాయులు మొగిలి రవి ఆధ్వర్యంలో శనివారం వ్యవసాయ క్షేత్రస్థాయి పర్యటన నిర్వహిం చారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా విద్యార్థిని, విద్యార్థులకు వ్యవసాయం సాగు విధానంపై క్షేత్రస్థాయి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో వరి నాట్లు వేస్తున్న పంట పొలాల్లోకి విద్యార్థులను తీసుకువెళ్లి పొలం మడులను దున్నడం, ఒడ్లు చెక్కడం, జంబు కొట్టడం, వరి పీకడం, వరి నాట్లు వేయడం వంటి సాగు విధానాల పై ప్రత్యక్ష అవగాహన కల్పించారు. విత్తనాలు వడ్ల నుండి వరి పైరు ఎలా అభివృద్ధి చెందుతుంది, తద్వారా బియ్యం ఎలా తయారవుతాయో క్షేత్రస్థాయి అవగాహన కల్పించారు. మధ్యాహ్న భోజనంకు బియ్యం ఎలా ప్రభుత్వం సరఫరా చేస్తుందో తదితర అంశాల పై ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. ఆహారంను వృధా చేయకుండా విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్ర మంలో ప్రధానోపాధ్యాయులు మొగిలి రవి, ఉపాధ్యాయులు ఆవారి శ్రీనివాస్, రాజ శేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏపీకే ఫైల్స్ ఓపెన్ చేయవద్దు

మల్యాల, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): తమ సెల్‌ఫోన్‌లకు వచ్చె ఏపీకే అని ఉండే ఫైల్స్ ఓపెన్ చేయవద్దని ఎస్సై నరేశ్‌కుమార్ సూచించారు. ఏపీకే ఫైల్స్ ఓపెన్ చేయగానే సెల్‌ఫోన్ హ్యాక్‌కు గురి అవుతుందని, ఫోన్‌లో ఉన్న డాటా, అకౌంట్‌లో ఉన్న డబ్బులు దొంగిలించబడుతాయని జాగ్రత్తగా ఉండాలని అన్నారు. ముఖ్యంగా ఆధార్. ఏపీకే, ఎస్‌బీఐ.ఏపీకే, పీఎం.ఏపీకే, యూనియన్ బ్యాంక్.ఏపీకే, సీఎస్‌ఈ.ఏపీకే ఫైల్స్ లాంటివి ఓపెన్ చేయవద్దని పేర్కొన్నారు.

నానో యూరియాపై మొగ్గు చూపాలి

భీమారం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రైతులు నానో యూరియా వైపు మొగ్గు చూపాలని మండల వ్యవసాయాధికారి షాహిద్ అలీ అన్నారు. మండలం లోని రాజలింగంపేట గ్రామంలో నానో యూరియా వినియోగం పట్ల శనివారం రైతులకు అవగాహన కల్పించారు. ఎరువులు, అధిక ఉత్పత్తి ఖర్చులు రైతులను ఆర్థికంగా ఒత్తిడికి గురి చేస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఇఫ్కో ద్వారా తీసుకువచ్చిన నానో యూరియా రైతులకు ఒక వరమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో సౌమ్య, గ్రామ రైతులు, కోరమాండల్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఓబీసీ మహాసభను విజయవంతం చేయాలి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీసీ సంక్షేమసంఘం నాయకులు

జగిత్యాల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): గోవాలో నిర్వహించనున్న ఓబీసీ మహాసభను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బ్రహ్మాండభేరి నరేశ్ అన్నారు. శనివారం పట్టణంలోని ఆర్‌డీఓ కార్యాలయ సమీపంలో చలో గోవా పోస్టర్ను బీసీ సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'మేమెంతో మాకు అంత' అనే నినాదంతో దేశవ్యాప్తంగా బీసీ ఉద్యమాన్ని విస్తరించాలని బీసీ రిజర్వేషన్ల ఆరాధ్యుడు బిపి మండల్ ఆగస్టు 7వ తేదీన జయంతిని పురస్కరించుకొని ప్రతిఏటా అన్ని రాష్ట్రాల్లో జయంతి ఉత్సవాల నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది శ్యాంప్రసాద్ ముఖర్జీ ఇండోర్ స్టేడియం గోవా యూనివర్సిటీ దగ్గర శాంటాక్రోచ్ గోవాలో అఖిల భారత జాతీయ ఓబీసీ పదవ మహాసభను బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన జరుగుతున్నట్లు తెలిపారు. ఓబీసీ మహాసభను విజయవంతం చేయాలని కోరారు. 42 శాతం అసెంబ్లీలో ఆమోదం పొందిన బీసీ రిజర్వేషన్ బిల్లును కేంద్రం తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చి తెలంగాణ బీసీలకు న్యాయం చేయాలని ప్రధాన డిమాండ్లతో జాతీయ ఓబీసీ మహాసభలు అనేక తీర్మానాలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూమి రమణ, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ముఖేష్ ఖన్నా, బీసీ మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గంగం జల, బీసీ సంఘం జిల్లా కార్యదర్శి పెండెం గంగాధర్, బీసీ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వేముల మనోజ్ కుమార్ పాల్గొన్నారు.